ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 19 అక్టోబరు 2024






- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతీ కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పనుల పరిశీలన
- మరుగుదొడ్ల మరమ్మతులకూ సత్వర పరిష్కారాలు
- గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు ఆ బాధ్యతపై విమర్శలు

పారిశుధ్యం.. స్కూల్ మేనేజ్‌మెంట్లకు

మున్సిపల్ స్కూల్

8



సందడి లేని అన్నవరం గ్రామం

ఊరే వృద్ధాశ్రమం

- ఉద్యోగాల కోసం పిల్లలు వలస
- అక్కడ ఇమడలేక.. ఇక్కడ ఉండలేక
- గ్రామాల్లో ఒంటరిగా పండుటాకులు

8



పాపం పండుటాకులు.. పలకరించేవారు లేరు. బాగోగులు చూసేవారు లేరు. తిన్నావా అని అడిగేవారు లేరు. కొన్నిళ్లల్లో వృద్ధ జంటలు. మరి కొన్నిళ్లలో ఒంటరి మహిళలు.. ఒంటరి పురుషులు. కావాల్సినంత డబ్బు. సకల సౌకర్యాలు. మంచిమంచి భవనాలు. అన్నీ ఉన్నా.. దిగాలు. ఇదీ గ్రామాల్లోని పరిస్థితి. ఆర్థిక స్తోమత లేకపోయినా పిల్లల్ని బాగాచదవించి.. రెక్కల కష్టంతో అమెరికా పంపి వారు ఉన్నతంగా స్థిరపడేలా చేశారు. దూరతీరాల్లో ఆర్థికంగా ఎదిగిన పిల్లల్ని చూసి సంబరపడ్డారు. అయితే ఇంతవరకు బాగున్నా.. వృద్ధాప్యంలో తమ పరిస్థితి తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. పిల్లల దగ్గరకు వెళ్లి ఉండలేక.. ఇక్కడ ఒంటరిగా ఉండలేక.. అనేకమంది వృద్ధులు సతమతమవుతున్నారు. తమ పిల్లలు గురించి గొప్పలు చెప్పుకున్న వారే.. ఇప్పుడు తమ పరిస్థితి మరెవ్వరికీ రాకుడదని మొక్కుకుంటున్నారు. రెక్కలు వచ్చిన పిల్లలు దూర ప్రాంతాలకు ఎగిరిపోగా వృద్ధులతో నిండిపోయిన ఇళ్లతో పలు పల్లెలు వృద్ధాశ్రమాలను తలపిస్తున్నాయి.

పిల్లల దగ్గర ఉండలేక..

గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఒంటరిగా ఉండలేక బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లింది. వెళ్లిన రెండ్రోజులు బాగానే ఉంది. ఆ తర్వాత నుంచి కోడలి నస మొదలైంది. ఇల్లు సరిపోవడం లేదని మొఖం నల్లగా పెట్టడంతో ఆమె అక్కడ ఉండలేకపోయింది. దీంతో తిరిగి ఇంటికి చేరుకుంది. కావాలంటే ఇంకో పదివేలు ఎక్కువ పంపుతాను అక్కడే సర్దుకోమని ఆమెకు కుమారుడు చెప్పాడు. అంత వయస్సు వచ్చిన కొడుక్కి అర్థం కానిది ఏమిటంటే ఈ వయసులో అమ్మకి కావలసింది నోట్లు కాదు.. తిన్నావా.. లేదా.. అని ప్రేమతో పలకరించే నోర్లు అని. ఇప్పుడు లంకంత కొంపలో ఆమె ఒక్కతే చరిత్రకు సాక్షిలా ఉంది. ఇదే పరిస్థితి గ్రామానికి చెందిన మరో వృద్ధుడిది. అందరూ మామా అంటారు. ఉన్న ఒక్క కూతురుకి వివాహం చేసేశాడు. వయసు మీద పడినా పిల్లనిచ్చిన దగ్గరికి వెళ్లి ఉండలేకపోతున్నాడు. ఒంటరి బతుకు తప్పడం లేదు మరి. ఇలాంటి పరిస్థితి గ్రామంలోని ప్రతీ గడపలోనూ కనిపిస్తోంది.

గుంటూరు మీదగా శబరిమలకు భారత గౌరవ రైలు

పెళ్లికి అంగీకరించలేదని.. ప్రేమికుల ఆత్మహత్య

- కులాంతర వివాహాన్ని వ్యతిరేకించిన కుటుంబ పెద్దలు
- రైలు కింద పడిన ప్రేమ జంట



మృతులు దానబోయిన మహేష్ (22), నంద్రు శైలజ (20)

6

ప్రత్యేక రైళ్ల ద్వారా బాదేందుకేనా..

- రైల్వే టిక్కెట్ల అడ్వాన్స్ రిజర్వేషన్ కాలం తగ్గింపుపై ప్రయాణికుల సందేహం
- రైల్వే చూపుతున్న కారణాలు సహేతుకంగా లేవని వాదన



ధాన్యం సేకరణ.. సరికొత్తగా

- జిల్లాల వారీగా లక్ష్యాలు పెంపు
- సత్వరమే నగదు చెల్లించేలా ప్రణాళికలు
- నూతనంగా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- అన్నదాతల ప్రయోజనాలు కాపాడడమే అంతిమ లక్ష్యం
- ఇష్టమైన మిల్లులకే ధాన్యం రవాణా చేసుకునే వెసులుబాటు
- గత ప్రభుత్వంలో దారుణంగా పడిపోయిన సేకరణ

బాపట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రహసనాన్ని తలపించిన ధాన్యం సేకరణ.. అలవికాని నిబంధనలు.. మిల్లర్ల మాయాజాలం.. డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి.. చెల్లింపులు సంగతి అయితే చెప్పక్కర్లేదు.. నిలువునా మోసాలు.. ఇదీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ధాన్యం సేకరణ తీరు. ఇక ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నిబంధనలు సడలించి ధాన్యాన్ని సేకరిస్తామనే ఊరడింపు మాటలు తప్పితే ఆచరణలో అమలైన దాఖలాలే లేవు. ఈ పరిస్థితుల్లో అన్నదాతల కష్టాలను గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వం నిలకడలేని నిర్ణయాలతో అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయగా కూటమి ప్రభుత్వం సరికొత్తగా సేకరణకు సిద్ధమైంది. ధాన్యం సేకరణలో గత ప్రభుత్వ హయాంలో నెలకొన్న బాలారిష్టాలన్నింటికి చరమగీతం పాడి ధాన్యానికి మద్దతు ధర పొందడం అనేది రైతు హక్కుగా చేసి వారికి న్యాయంచేయడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. ఖరీఫ్ నుంచే మార్చిన మార్గదర్శకాలను అమల్లోకి తేవడంతోపాటు రైతుల ఖాతాల్లో నగదును వెంటనే జమచేసేలా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలో త్వరలో చేపట్టబోయే ధాన్యంసేకరణను సరికొత్తగా పట్టాలెక్కించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాలో అత్యధికంగా..

ఖరీఫ్‌లో వరిసాగు అత్యధికంగా బాపట్ల జిల్లాలో దాదాపు 2.15 లక్షల ఎకరాల్లో సాగవుతూ ఉండగా దిగుబడి అంచనాలు 5.50 లక్షల టన్నులుగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే వరిసాగు గతంలో దాదాపుగా 1.65 లక్షల హెక్టార్లలో సాగవుతూ వస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యం బాపట్ల జిల్లాలో 50,000 మెట్రిక్ టన్నులు కాగా, గుంటూరు జిల్లాలో 10,000 టన్నులు, పల్నాడు జిల్లాలో 5,000 టన్నులు సేక రించాలని యంత్రాంగం నిర్దేశించుకుంది. గతం లో ధాన్యం సేకరణలో రైసుమిల్లుల యాజమా న్యాలు అన్నదాతలను తీవ్ర ఇక్కట్లకు గురిచేసే వారు. ఇక మీదట మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రి యను రద్దు చేసి అన్నదాతలు తమకు ఇష్టమైన మిల్లులకే ధాన్యం తరలించుకునే వెసులుబాటు ను కూటమి ప్రభుత్వం కల్పించింది. గతంలో మి ల్లులకు తీసుకెళ్లిన ధాన్యం విషయంలో రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. రైతుల ఇక్కట్లకు స్వస్తి పలికే విధంగా ప్రతి మిల్లుకు ఓ ఉద్యోగిని పరిశీలకుడుగా నియమించి అటు అన్నదాతలకు ఇటు అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసేలా నిర్ణయం తీసుకుంది. గతంలో ధాన్యం డబ్బులు సకాలంలో జమకాక అన్నదాతలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఇకపై ఇలాంటి ఎదురుచూపులకు ఆస్కారం లేకుండా ధాన్యం అమ్మిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

లక్ష్యాలు చేరుకోవాల్సిందే...

గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ లక్ష్యం కేవలం అంకెలకే పరిమితమయ్యేది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదనే సమర్థనను కూడా అధికారులు ఇచ్చుకునే వారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉండేవి. అలవిమాలిన నిబం ధనల చక్రానికి తోడు నగదు చెల్లింపులో గత ప్రభుత్వం అవలంబించిన నిర్లక్ష్య ధోరణే సేకరణ కు ప్రతిబంధకాలుగా ఉండేవి. గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకున్న రైతన్న తీవ్రంగా నష్టపోయేవారు. ఈ పరిస్థితుల్లో ఈ సీజన్ నుంచి ఏ కారణంతోనూ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలును యంత్రాంగం నిరాకరించకూడదని ఆదేశించింది. నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని నిర్దేశించింది. జిల్లాల వారీగా త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాలను యంత్రాంగం చేరుకోవాల్సిందేనని స్పష్టమై న ఆదేశాలను జారీ చేసింది

గతంలో లక్ష్యంలో సగం కూడా చేరుకోలేక..

వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల గడచిన మూడేళ్లలో ధాన్యం సేకరణ ఏటికేడు కుచించుకుపోయింది. 2022--23 ఆర్థిక సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లో బాపట్ల జిల్లాలో సేకరించిన ధాన్యం 40 మెట్రిక్ టన్నులు కాగా అది గతేడాది 32,000కు పడిపోయింది. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ విధించుకున్న లక్ష్యాలకు సేకరణకు పొంతనలేని పరిస్థితి. గడచిన ఆర్థిక సంవత్సరం ఖరీఫ్‌కు గుంటూరు జిల్లాలో 15,000 మెట్రిక్ టన్నులు లక్ష్యం పెట్టుకోగా అది 4,000 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. ఇక పల్నాడు జిల్లాలో పెట్టుకున్న లక్ష్యం పదివేల టన్నులు కాగా 5,000 మెట్రిక్ టన్నులకే అది కుచించుకుపోయింది ఇలా ఏటికేడు సేకరణ లక్ష్యాలకు ముగింపు లెక్కలకు సంబంధం లేకుండా ధాన్యాన్ని సేకరించి మమ అనిపించి గత ప్రభుత్వం చేతులు దులుపు కునేది.

గుంటూరులో డ్రగ్స్ కలకలం

- 66 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు
- బెంగళూరు.. గుంటూరు వయా హైదరాబాద్‌కు రవాణా
- సప్లయర్, వినియోగదారుల కోసం పోలీసుల గాలింపు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, పరికరాలు, సెల్ ఫోన్‌లు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరులో మళ్లీ డ్రగ్స్ కలకలం రేపింది. ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్‌ను గుంటూరులో పోలీసులు గుర్తించారు. ఇద్దర్ని అరెస్టు చేసి 5 లక్షల ఖరీదైన 66 గ్రాముల డ్రగ్ ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి గుంటూరుకు తరలించి ఇక్కడి నుంచి హైదరా బాద్‌కు పంపేందుకు సిద్ధమైన క్రమంలో ఇన్నర్ రింగ్‌రోడ్డుకు చెందిన షేక్ యూసుఫ్ షరీఫ్‌ను, లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల కాం పౌండ్‌లో ఉండే బట్టు డోనాల్డ్ అలియాస్ టోనీల ను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్‌ను హైదరా బాద్‌కు పంపేందుకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కోసం వేచి ఉండగా కొత్త పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కేసు వివరాలను ఎస్పీ సతీష్ కుమార్ మీడియాకు వివరించారు. యూసుఫ్ షరీఫ్ గతంలో బెంగళూరులో ఉద్యోగం చేసే ప్రాంతంలో పరిచయమైన వ్యక్తి ద్వారా ఎండీ ఎంఏ డ్రగ్ అలవాటైంది. ఆ తర్వాత అక్కడ ఉ ద్యోగం మానేసిన యూసుఫ్ కొంతకాలం విదే శాల్లో ఉన్నారు. తిరిగి గుంటూరుకు వచ్చి ప్రస్తు తం ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గతంలో బెంగళూరు పరిచయమైన వ్యక్తి ద్వారా డ్రగ్స్ తెప్పించుకుని డీజే ఈవెంట్ ఆర్గనైజరైన డోనాల్డ్‌తో కలిసి వినియోగిస్తున్నాడు. హైదరాబా ద్‌లోని స్నేహితులు డ్రగ్ తెప్పించమని రూ.లక్ష యూసుఫ్ షరీఫ్‌కు పంపారు. ఈ క్రమంలో బెం గళూరులోని తన స్నేహితుడికి రూ.75 వేలు పం పగా ఈ నెల 16న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గుంటూరుకు పంపాడు. అందులో కొంచెం డోనా ల్డ్‌కు ఇచ్చి మిగిలిన డ్రగ్‌ను హైదరాబాదులోని స్నేహితులకు ఇచ్చేందుకు సిద్ధమవగా కొత్తపేట సీఐ ఎం వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి ఐదు లక్షల ఖరీ దైన 66.26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌తో పాటు నాలుగు స్మార్ట్ ఫోన్లు, ఐప్యాడ్, పోర్టబుల్ ఎలక్ట్రా నిక్ వేయింగ్ మిషన్, డ్రగ్స్ పీల్చడానికి ఉపయో గించే ట్యూబులు స్వాధీనం చేసుకున్నారు. నింది తులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్పీ తెలిపారు. డ్రగ్ సప్లై చేస్తున్న వ్యక్తి కోసం ప్రత్యేక పో లీస్ బృందాలను బెంగళూరు పంపినట్లు ఎస్పీ తెలి పారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తిని ప ట్టుకుంటే పూర్తి లింకులు వెలుగు చూసే అవకాశం ఉందన్నారు. మరో బృందం హైదరా బాద్ వెళ్లినట్లు ఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ వినియోగించే పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ అజీజ్, సీఐ వీరయ్యచౌదరి

గతంలోనూ డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలు

గతంలోనూ గుంటూరులో డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలు వెలుగు చూశాయి. గుంటూరుకు చెందిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి సోదరుడి కుమారుడు గతంలో డ్రగ్స్ రవాణా, విక్రయంలో కీలక పాత్ర పోషించగా అధికార పార్టీ అండదండలతో పోలీసులు వదిలేశారు. బెంగళూరు నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గుంటూరుకు డ్రగ్స్ వస్తుండగా మార్టూరు సమీపంలో పోలీసులు టోల్గేట్ వద్ద అదుపులో తీసుకోగా డ్రగ్స్ వ్యవహా రం వెలుగుచూసింది. గుంటూరులోనూ మాఫి యాను అదుపులోకి తీసుకున్న సమయంలో ఆయన పేరు బయటకు వచ్చినా అప్పటి లాలాపేట సీఐ అతడ్ని కేసు నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. గుంటూరుకు చెందిన సాయిమస్తాన్ అనే యువకుడ్ని ఇటీవల విజయవాడ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేశారు. సాయి మస్తాన్ గతంలో డ్రగ్స్ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొన్న సినీ నటి లావణ్యకు డ్రగ్స్ ఇచ్చినట్లు పోలీసులు విచారణలో తేలింది. గుంటూరుకు చెందిన వరలక్ష్మి టిఫిన్స్ అధినేత రెడ్డి తన బ్రాంచీలను హైదరాబాదులో ప్రారంభించిన తర్వాత అక్కడ డ్రగ్స్‌కు అలవాటు పడడమేగాక డ్రగ్స్ సరఫరాలోనూ పాత్ర పోషించి అరెస్ట్ అయ్యాడు.



పోటీలను ప్రారంభిస్తున్న ప్రాంతీయ క్రీడా ఇన్‌స్పెక్టర్ మహబూబ్, డీవైఈవో వెంకటేశ్వరరావు

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

- అండర్ -14,17 చెస్ పోటీలను ప్రారంభించిన డీవైఈవో
- ఉమ్మడి జిల్లా నుంచి 340 మంది విద్యార్థులు హాజరు

గుంటూరు(విద్య),అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఐకమత్యం వెల్లివిరిస్తుందని డీవైఈవో పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థాని చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల స్కూల్‌లో అండర్-14,17 చెస్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెరగాలని, గెలుపు ఓట ములను సమంగా చూడాలన్నారు. ప్రాంతీయ క్రీడా ఇన్‌స్పెక్టర్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ ఆటలు విద్యార్థుల్లో సమైక్యతను చాటి చెబుతాయని చెప్పారు. హెచ్‌ఎం ఎస్‌కె ఎండి ఖాసిం మాట్లాడుతూ చదువుతోపాటు ఆటపాటల్లో విద్యార్థులు రాణించాలని అప్పుడే సంపూర్ణ వికాసం సాధ్యమౌతుందన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 17 నియోజకవర్గాల్లోని స్కూల్స్ నుంచి 340 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు సామ్రాజ్యం, రవిశేఖర్, చెస్ ఆర్బిటర్ ఎం గోపినాథ్, కన్నా స్కూల్ డైరెక్టర్ కన్నామస్తారు, పి.సాయిబాబు, ఎం.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి వేదికగా డ్రోన్ సమ్మిట్

- రెండు రోజుల పాటు నిర్వహణకు ఏర్పాట్లు
- అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న సాంకేతిక సదస్సు
- దేశ, విదేశాల నుంచి పెద్దసంఖ్యలో రానున్న ఔత్సాహికులు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న ఈవెంట్‌కు మంగళగిరి వేదిక కానుంది. ఈ నెల 22, 23 తేదీల్లో జరగబోయే అమరావతి డ్రోన్ సమ్మిట్-2024కు ఆతిథ్యం ఇవ్వనుంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న సీకే కన్వెన్షన్‌లో ఈ సాంకేతిక పరిజ్ఞాన సదస్సు డ్రోన్ టెక్నాలజీలో కొత్త విషయాలను ఆవిష్కరించబోతున్నది. దేశ, విదేశాల నుంచి ఐదు వేల మందికి పైగా ఈ మెగా ఈవెంట్‌కి హాజరౌతారని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం అటు విజయవాడ, ఇటు గుంటూరులో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో ఒక్కటంటే ఒక్క జాతీయ, అంతర్జాతీయ సదస్సు కూడా ఇక్కడ జరగలేదు. ఒక విధంగా అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక మంగళగిరికి పూర్వవైభవం వస్తున్నది. తాజాగా అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించడంతో అందరిని ఆకర్షిస్తున్నది. రాబోయే కాలమంతా డ్రోన్ టెక్నాలజీదే. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విపత్తుల నిర్వహణ, అర్బన్ ప్లానింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మానిటరింగ్, భద్రత, హెల్త్‌కేర్, మందుల సరఫరా, పర్యావరణ, సహజ వనరుల యాజమాన్యం తదితర రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ విస్తరించనున్నది. అలానే సర్వే, మ్యాపింగ్, సరుకు రవాణా వంటి వాటిల్లోనూ డ్రోన్ల సేవలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల వరదలు సంభవించిన సమయంలో డ్రోన్‌లు కొంతమేరకు సహాయపడ్డాయి. ఇంకా ఎక్కడెక్కడ అంతరాలున్నాయి, వాటిని ఏ విధంగా పూడ్చాలి అనే అంశాలపై ఈ సమ్మిట్‌లో పాల్గొనబోయే ఇంజనీర్లు తమ ఆలోచనలను పంచుకోబోతున్నారు.





మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్-2024 ఏర్పాట్లు

ఐదు వేల డ్రోన్లతో కనువిందు..

వేల సంఖ్యలో ఇంజనీర్లు వారు రూపొందించిన డ్రోన్లతో హాజరు కానుండటంతో చక్కటి ఆతిథ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 22వ తేదీ సాయంత్రం విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 5 వేల డ్రోన్లు ఒకేసారి వినీలాకాశంలో ఎగిరి ఎల్‌ఈడీ దీపాల కాంతులతో కనువిందు చేయనున్నాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అక్కడ జరగనున్నాయి.

ఈ సమ్మిట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ హ్యాకథాన్‌ని కూడా నిర్వహించబోతోన్నది. మొత్తం 9 అంశాలపై ఈ హ్యాకథాన్ జరుగుతుంది. నాలుగు కేటిగిరీల్లో జరగనున్న ఈ హ్యాకథాన్‌లో ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి కింద రూ.2లక్షలు, తృతీయ బహుమతి కింద రూ.లక్ష ఇవ్వనుంది. ఇందుకోసం ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి అయ్యాయి. ఈ నేపథ్యంలో మరో నాలుగు రోజుల్లో జరగనున్న ఈ డ్రోన్ సమ్మిట్ కోసం ఇక్కడి ప్రజలే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

విజయవంతం చేయాలి : సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అక్టోబరు 22, 23 తేదీల్లో నిర్వహించనున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024 విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ ఆదేశించారు. శుక్ర వారం సచివాలయం నుంచి ఆయన అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024 నిర్వహణపై గుంటూరు కలెక్టర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సం దర్భంగా సీఎస్ మాట్లాడుతూ అక్టోబరు 22న డ్రోన్స్ జాతీయ సదస్సును ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డు ప్రారంభిస్తారన్నారు. ఈ సమ్మిట్‌కు ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు రాష్ట్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

తాడికొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన శుక్రవారం నిడుముక్కల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తుళ్లూరు గ్రామ పంచాయతీలో కార్మికులుగా పనిచేస్తున్న కంతేటి ఏసు (63), బత్తుల అయ్యప్పస్వామి(45) ద్విచక్ర వాహనంపై నిడుముక్కల గ్రామంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి ఇంటికి తిరిగి బయలు దేరారు. నిడుముక్కల- తాడికొండ అడ్డరోడ్డు మధ్యలోకి రాగానే గుంటూరు నుంచి అమరావతి వెళ్తున్న లారీ ఎదురుగా బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. అయ్యప్పస్వామికి భార్య కుమాడు, కుమార్తె ఉన్నారు. ఏసు భార్య ఇటీవల మృతి చెందారని, ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారని పోలీసులు తెలిపారు. తాడికొండ సీఐ కె.వాసు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

పెళ్లిని అంగీకరించలేదని.. ప్రేమికుల ఆత్మహత్య

- కులాంతర వివాహాన్ని వ్యతిరేకించిన కుటుంబ పెద్దలు
- రైలు కింద పడిన ప్రేమ జంట



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లిని పెద్దలు అంగీకరించలేదన్న మనస్తాపంతో ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన పెదకాకానిలోని నంబూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే పట్టాలపై గురువారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదకాకాని యాదవపాలెంకు చెందిన దానబోయిన సాంబశివరావు చిన్న కుమారుడు దానబోయిన మహేష్ (22) డిగ్రి వరకు చదువుకున్నాడు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నంద్రు వెంకయ్య కుమార్తె శైలజ చదువుకుని ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వచ్చింది. హైదరాబాదు ఓ ప్రైవేట్ సెల్‌ఫోన్ కంపెనీలో ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చాయి. ఇద్దరూ ఒకే కంపెనీలో పని చేస్తున్న క్రమంలో వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. వారి ప్రేమ వ్యవహారాన్ని ఇరువురి కుటుంబ పెద్దలకు తెలియజేశారు. ఈ క్రమంలో ఇద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాన్ని వదులుకొని గుంటూరు వచ్చారు. ఇరువురి కుటుంబాలకు తెలియకుండా గుంటూరు వచ్చి నివాసం ఉన్నారు. మహేష్ సెల్‌ఫోన్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, శైలజ గుంటూరు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తుంది. పది రోజుల క్రితం వీరు ఇరువురు వారి ఇళ్లకి వెళ్లి తమ ప్రేమ వ్యవహారాన్ని పెద్దలకు చెప్పారు. కులాంతర వివాహాన్ని పెద్దలు అంగీకరించకపోవడంతో వారం రోజుల క్రితం ఇద్దరూ వారి ఇళ్లల్లో నుంచి వచ్చేశారు. దీంతో యువతి తల్లిదండ్రులు తమ కుమార్తె అదృశ్యమైందని, అందుకు కారణం పెదకాకానికి చెందిన మహేష్ కారణమని నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్ తల్లిదండ్రులను నందిగామ పోలీసులు పిలిపించి విచారించారు. మా అబ్బాయి కూడా వారం రోజులుగా కనిపించడంలేదని వారు పోలీసులకు తెలిపారు. వీరు ఎక్కడికి పోయారా.. అని ఇరువురి తల్లిదండ్రులు మదనపడుతుండగా రైల్వే పట్టాలపై నంబూరు రైల్వే స్టేషన్ సమీపంలో మృతదేహాలై పడి ఉన్నారు. గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై లగేజ్ బ్యాగులతో శైలజ, మహేష్ అక్కడికి చేరుకొని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని రైల్వే పట్టాలపై పడుకున్నారు. రైలు వారి పైన పోవడంతో తలభాగాలు కట్ అయ్యాయి. తలలో మెదడు ఇరువురికి బయటకు వచ్చేసింది. శైలజ కాలు తెగి రైల్వే పట్టాల అవతల పడింది. స్థానికులు పెదకాకాని పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే సీఐ అంజిబాబు, ఎస్సై రమేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మృత్యులోనూ వీడని బంధం

శైలజ, మహేష్‌కు మధ్య ఏర్పడిన స్నేహం ప్రేమగా మారి చివరకు మృత్యువులో కూడా ఇద్దరు కలిసి మరణించారు. మృత్యువులో కూడా వీరి బంధం వీడలేదు. ఒకరినొకరు అర్థం చేసుకొని, గాఢంగా ప్రేమించుకోవడం వల్లే ఇద్దరు కలిసి మరణించారు. కులాంతర వివాహాన్ని కుటుంబ పెద్దలు అంగీకరించకపోవడంతో వీరు ఆత్మహత్య చేసుకున్నారు. రైలు పట్టాలపై తలలు పెట్టి, ఒకరి చేయి మరొకరు పట్టుకొని బలవంతంగా మరణించారు.

ఎమ్మెల్యే నరేంద్ర పరామర్శ..

సమాచారం తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చిన్న వయసులో ఇరువురు మృతి చెందడాన్ని చూసి విచారం వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధాకరమని ఆయన వేదన చెందారు. మృతుడు మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

24న జాబ్‌మేళా

గుంటూరు(విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 24న మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అమరాజా బ్యాటరీస్, అపోలో ఫార్మసీ, ఫ్లిప్‌కార్ట్, తనిష్క్ తదితర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమా, ఫార్మసీ పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్‌తో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0863-2350060లో సంప్రదించాలని సూచించారు.

చీమలమర్రిలో చోరీ

- పది సవర్ల బంగారం, నాలుగు కిలోల వెండి ఆభరణాలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

నకరికల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చీమలమర్రి గ్రామంలో గడ్డం శివరామకృష్ణ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో రూ. 10 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన గడ్డం శివరామకృష్ణ గురువారం గుంటూరులోని తన మనుమరాలి వివాహ విషయమై కుటుంబ సభ్యులతో కలసి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంట్లో తలుపులు తీసి ఉన్నాయని స్థానికులు శివరామకృష్ణకు ఫోన్ ద్వారా తెలియజేయటంతో గుంటూరు నుంచి వచ్చారు. పోలీసులకు సమాచారం అందించటంతో చీమలమర్రిలో శివరామకృష్ణ ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఇనుప గ్రిల్‌ను తొలగించి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు ఉంగరాలు, తాళిబొట్టు తాడు, నల్లపూసల గొలుసు, సుమారు నాలుగు కిలోల వెండి ఆభరణాలు, రూ.86 వేల నగదు అపహరించుకు పోయారు. నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ టీచర్ మృతి

వినుకొండ టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడి స్కూల్ టీచర్ మృతి చెందిన సంఘటన మండలంలోని నాగులవరం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం గోకనకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కొత్తమాసు ధనలక్ష్మి (41) పాఠశాలకు వస్తుండగా, ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనం రోడ్డు గుంతలోకి దిగడంతో అదుపు తప్పింది. వాహనం వెనుక కూర్చొని ఉన్న టీచర్ కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. రోజూ అద్దంకి నుంచి వెంకటాపురం వరకు వినుకొండ ఆర్టీసీ బస్సులో వచ్చి, అక్కడ నుంచి తన స్కూటీపై గోకనకొండకు వచ్చే వారని, స్కూటీ ఉన్న ఇంటి యజమాని ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన టీచర్, అదే బాటలో నాగులవరం హైస్కూల్‌లో పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై ఎక్కి ఇద్దరూ పాఠశాలకు వస్తున్నారు. నాగులవరం గ్రామ సమీపంలోకి రావడంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనం తప్పి టీచర్ మృతి చెందారు. పోలీసులు మృతదేశాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతిరాలి భర్త నాగేశ్వరరావు అద్దంకిలో హోల్‌సేల్ వర్తక వ్యాపారం చేస్తున్నారని, వీరికి 7వ తరగతి చదివే ధనూష్ అనే కుమారుడు ఉన్నారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్‌తో ఢీ

నకరికల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వ్యక్తిని బైక్ నడుపుతున్న వ్యక్తి ఢీకొట్టాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర ప్రధాన రహదారిపై నకరికల్లులోని సాయి నరసింహారెడ్డి నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా అడ్డరోడ్డు నుంచి వేగంగా వస్తున్న ఏపీ 16ఏఎం 315 నంబరు గల బైక్ నడిపే వ్యక్తి అతి వేగంగా వస్తూ రోడ్డు దాటుతున్న నరసింగపాడుకు చెందిన పుల్లంశెట్టి సుబ్బయ్య(48)ని ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి కూడా కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో నరసరావుపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సుబ్బయ్య మృతి చెందాడు. మృతుని కుమారుడు మహేష్ బాబు ఫిర్యాదు మేరకు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపడి గొర్రెల కాపరి మృతి

వినుకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని దొండపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పొలంలో గొర్రెలు మేపుతుండగా పి.కొండయ్య (51)పై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్ట అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్లూరు గ్రామానికి చెందిన చేకూరి రామకృష్ణ (35) ప్రమాదవశాత్తూ తమ గృహం పైనుంచి పడి మృతి చెందాడు. ఆయన మృతి అనుమానాస్పదంగా ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 54,125 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 59,206 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 65 గేట్లను 1 అడుగు, 5 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 54 వేల 125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 65,916 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 64,312 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని తెలిపారు. 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	135, 145,155
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

ప్రత్యేక రైళ్ల ద్వారా బాదేందుకేనా?

- రైల్వే టిక్కెట్ల అడ్వాన్స్ రిజర్వేషన్ కాలం తగ్గింపుపై ప్రయాణికుల సందేహం
- రైల్వే చూపుతున్న కారణాలు సహేతుకంగా లేవని వాదన

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే టిక్కెట్ల అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్(ఏఆర్‌పీ)ని 120 రోజుల నుంచి 60 రోజులకు కుదిస్తూ రైల్వేబోర్డు జారీ చేసిన ఉత్తర్వులపై ప్రయాణికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పు వలన తమకు ఏమాత్రం మేలు జరగదన్న అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. పైగా దీని వలన తత్కాల్ సమయంలో ఎలాగైతే బుకింగ్స్‌కి రద్దీ తలెత్తుతుందో ఇకపై ప్రతీ రోజు ఉదయం 8 గంటలకు 60 రోజుల దాటిన తర్వాత రోజు రైళ్లలో టిక్కెట్ల రిజర్వేషన్ ఓపెన్ కాగానే వాటి కోసం ఆన్‌లైన్, పీఆర్ఎస్ కౌంటర్లలో రద్దీ ఏర్పడుతుందని చెబుతున్నారు. గతంలో ఈ పరిస్థితిని చూసే ఏఆర్‌పీని 120 రోజులకు పెంచారని, ఇప్పుడు తగ్గించడం వలన ఉపయోగం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

డిమాండ్‌పై స్పష్టత కోసమే..

రైళ్లలో ఏఆర్‌పీ 1995 సెప్టెంబరు 1వ తేదీ నుంచి 1998 జనవరి 31వ తేదీ వరకు 30 రోజులు ఉండేది. దీనిని ఆ తర్వాత సవరించి 60 రోజులకు పెంచారు. 2015 జనవరి 1వ తేదీ వరకు 60 రోజుల ఏఆర్‌పీ అమల్లో ఉంది. ఆ తర్వాత 120 రోజుల ఏఆర్‌పీని తీసుకొచ్చారు. దాదాపుగా ఈ నూతన విధానం అమలులోకి వచ్చి పదేళ్లు పూర్తి కావస్తుంది. ఇప్పుడు హఠాత్తుగా తిరిగి రోజుల ఏఆర్‌పీని రైల్వే శాఖ కుదించేసింది. ఇందుకు కొన్ని కారణాలను చెబుతున్నది. 61 నుంచి 120 రోజుల మధ్యన ఏఆర్‌పీలో బుకింగ్ అవుతున్న టిక్కెట్లలో 21 శాతం రద్దు చేసుకొంటున్నారని పేర్కొంటుంది. అలానే మరో 5 శాతం టిక్కెట్లను బుకింగ్ చేసుకొన్న వారు ఓ వైపు రద్దు చేసుకోకుండా మరోవైపు ప్రయాణం చేయడం లేదని తెలిపింది. దీనివలన రైలు ప్రయాణ డిమాండ్‌పై స్పష్టత ఉండటం లేదని చెప్పింది. 60 రోజులకు ఏఆర్‌పీని కుదించడం వలన వాస్తవ రైలు ప్రయాణ డిమాండ్‌పై స్పష్టత ఉంటుందని, తద్వారా మరిన్ని ప్రత్యేక రైళ్లను ప్లాన్ చేయవచ్చని తెలిపింది.

సకాలంలో నడిపేటట్లు అయితే..

కాగా ప్రత్యేక రైళ్లు అనగానే ప్రయాణికులు భయపడిపోతున్నారు. వీటిల్లో తత్కాల్(రెగ్యులర్ రైళ్లలో కంటే అదనపు) ఛార్జీని వసూలు చేస్తారు. పైగా వాటిని నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నడపరు. ఎక్కడికక్కడ రెగ్యులర్ రైళ్లకు క్రాసింగ్‌లు, ప్రిసిడెన్స్‌లు ఇచ్చి లూప్‌లైన్‌లో గంటల తరబడి పెడుతూ ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తుంటారు. ముఖ్యంగా తెనాలి వంటి రైల్వేస్టేషన్‌లో స్పెషల్ ట్రైన్ రాత్రి 9 గంటలకు వెళ్లిందంటే కనీసం రెండున్నర గంటల పాటు దానిని లూప్‌లైన్‌లో పెట్టక తప్పని పరిస్థితి. ఇందుకు కారణం ఆ సమయంలో ప్రతీ ఐదు నిమిషాలకు ఒక రైలు మెయిన్‌లైన్‌లో కూత పెడుతూనే ఉంటుంది. ఐదు, ఆరు గంటల ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుతుంటాయి. ప్రత్యేక రైళ్లను ప్లాన్ చేసి వాటిని సకాలంలో నడిపితే ఏఆర్‌పీని 60 రోజులకు కుదించినా ఇబ్బంది ఉండదని, ఎటొచ్చి వాటిని ఆలస్యంగా నడపడమే అసలు సమస్యన్న అభిప్రాయాన్ని ప్రయాణికులు వ్యక్తపరుస్తున్నారు.

తిరుమలకు వెళ్లే వారికి ఇబ్బందే..

ప్రస్తుతం తిరుమలకు స్పెషల్ ఎంట్రీ దర్శన్, వివిధ రకాల సేవల కోసం వెళ్లే యాత్రికులు ఇంచుమించు 100 రోజులు ముందుగానే బుకింగ్ చేసుకొంటారు. జనవరి నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వివిధ సేవల ఆన్‌లైన్ బుకింగ్ ఈ నెల 20వ తేదీ తర్వాత ప్రారంభం అవుతుంది. దీనివలన ఆయా తేదీల్లో రైళ్లల్లో బెర్తులు ఖాళీ ఉన్నాయో, లేవో చూసుకొని ఆ తేదీకి తిరుమల టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొంటారు. ఇప్పుడు రైల్వే శాఖ 60 రోజులకు ఏఆర్‌పీని కుదించడం వలన యాత్రికులు తొలుత తిరుమల టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొని ఆ తర్వాత రైల్వే టిక్కెట్ల కోసం ఎదురు చూడాలి. ఒకవేళ రద్దీ వలన రైళ్లలో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేకపోతే ప్రయాణం ఆర్థికంగా భారం అవుతుంది.

అమరావతి రైతుల కౌలు సమస్య పరిష్కరిస్తాం

- సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్



తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో రైతులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతి ప్రాంతంలో రైతులకు సంబంధించిన కౌలు సమస్యలను ఇప్పటి వరకు కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమ చేశామని, మిగిలిన వారి సమస్యలను కూడా వెంటనే పరిష్కరిస్తామని ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సాయి సూర్య ప్రవీణ్ చంద్ హామీ ఇచ్చారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు విశేషంగా పాల్గొని వారి సమస్యలను అదనపు కమిషనర్‌కి విన్నవించుకున్నారు. ఏపీ సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్‌కు హాజరై అదనపు కమిషనర్ కి వచ్చిన సమస్యల్లో అధిక శాతం అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కౌలుపై కొందరు రైతులు అదనపు కమిషనర్‌కి నివేదించగా ఇప్పటికే చాలా మంది రైతులకు కౌలు సమస్యలు పరిష్కరించి వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్‌డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు ఎం.విశేశ్వర నాయుడు , కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బకాయిల సమాచారం లేకపోతే ఎలా?

- జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా



సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మైనింగ్... రిజిస్ట్రేషన్ శాఖలు ఉమ్మడి జిల్లా పరిషత్‌కు సర్‌ఛార్జి, స్టాంప్ డ్యూటీ రూపేణా కోట్ల రూపాయలు చెల్లించాలి. అసలు ఎంత మొత్తం చెల్లించాలో ఆయా శాఖల అధికారుల వద్ద ఖచ్చితమైన సమాచారం లేదు. ఎప్పుడు చెల్లిస్తారో కూడా రెండు శాఖల అధికారులు స్పష్టంగా చెప్పడం లేదు. ఫలితంగా కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఉమ్మడి జిల్లాలో తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. రెండేళ్లుగా ఎన్నోసార్లు జిల్లా పరిషత్ అధికారులు లేఖలు రాసినా ఆయా శాఖల నుంచి స్పందన లేదు. చివరకు శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఇదే వ్యవహారంపై సమీక్షించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మూడు జిల్లాల అధికారులు వచ్చారు కానీ సమాచారం మాత్రం తీసుకురాలేదు. రెండు శాఖల అధికారుల నిర్లక్ష్యంపై జడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సమాచారం లేకుండా ఎందుకు వచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌తోపాటు, జిల్లాలో ఉన్న నియోజకవర్గాల్లో ఏ మేరకు సర్‌ఛార్జి, స్టాంప్ డ్యూటీ బకాయిలు ఉన్నాయో సమాచారం లేకుండా ఎలా ఉన్నారని ప్రశ్నించారు. దీంతో అధికారులు సోమవారం నాటికి బకాయిల వివరాలు తీసుకువస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా బకాయిలు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్పీసీఈవో వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో కృష్ణ, విభాగాల ఏవోలు పాల్గొన్నారు.

ఇదేమిటి ఇలా ఇరికించారు

- అక్రమార్కులపై రైతుల ఆగ్రహం
- తమ ఖాతాలో పడిన రూ.10.24లక్షలు తిరిగి చెల్లింపు

మేడికొండూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో వరద సాయం అక్రమాలు దాదాపుగా బహిర్గతం అయ్యాయి. ఇదేమిటి ఇలా ఇరికించారు.. అంటూ వరద నష్టం జాబితాలో తమ పేరులను ఇరికించిన అక్రమార్కులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు తాము స్వాహా చేసిన సొమ్మును గురు, శుక్రవారాల్లో తిరిగి రైతులకు అందజేశారు. తమ ఖాతాలో వరద సాయం ఎలా పడిందో తెలియదని చెబుతూ అధికారులకు రైతులు నగదు చెల్లిస్తున్నారు. శుక్రవారం నాటికి 10లక్షల 24వేల రూపాయలను రైతులు తిరిగి చెల్లించారు. పంట నష్టం పరిహారం పంపిణీలో అక్రమాలపై అధికారుల విచారణ మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఒక్క వెలవర్తిపాడు గ్రామంలోనే 106 హెక్టార్లలో 104 మంది రైతులు నష్టపోయినట్టుగా అధికారులు ప్రభుత్వానికి జాబితా పంపారు. ఈ జాబితాలోనే మేడికొండూరుకు చెందిన బోడెపూడి జోగేశ్వరరావు, వ్యవసాయశాఖలో ఏఈవోగా పని చేస్తున్న నాగరాజు అనే ఇద్దరు తమకు పరిచయమున్న కొందరిని, బంధువులో మరి కొందరిని పంట నష్టపోయిన వారి జాబితాలో చేర్చారు. జాబితాలో సిరిపురం, మేడికొండూరు, గుండ్లపాలెం గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. తాము వెలవర్తిపాడు గ్రామంలో వ్యవసాయం చేయలేదని అధికారులకు రాత పూర్వకంగా ఇచ్చారు. అక్రమార్కులిద్దరూ తాము స్వాహా చేసిన సొమ్మును రైతులకు అందజేసి అధికారులకు చెల్లించమని ప్రాధేయపడుతున్నారు.

రూ.10.24 లక్షలు తిరిగి చెల్లించిన రైతులు

పంట నష్ట పరిహారం తమ ఖాతాలో పడిందని చెబుతూ రైతులు ఇప్పటి వరకు రూ.10.24లక్షలు చెల్లించారని విచారణ చేస్తున్న గుంటూరు ఏడీఏ తిరుమల దేవి విలేకరులకు తెలిపారు. వెలవర్తిపాడు గ్రామంలోనే మొత్తం పరిహారం రూ.18 లక్షలు కాగా దానిలో చాలా వరకు సంబంధంలేని వ్యక్తుల ఖాతాలో పడిందని, దీనికి బాధ్యులైన అధికారులను కూడా విచారిస్తామని చెప్పారు. ఇంకా కొంతమంది తాము తిరిగి చెల్లిస్తామని చెబుతున్నారని ఆమె వివరించారు. అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు.

50,503 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 43,523 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,503 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 19,806 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8200	16000	334	8500	16000
నెంబరు.5	8500	16000	నెంబరు. 5	10500	10500
273	12000	13500	273	13000	13500
341	9000	16000	341	10000	17000
4884	12000	13800	4884	11500	16500
సూపర్ 10	-	-	సూపర్ 10	11300	11300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	8000	18200
బ్యాడిగి	8500	16500	బ్యాడిగి	9000	14500
దేవనూరు డీలక్స్	9000	16000	దేవనూరు డీలక్స్	10000	15000
తెల్లకాయలు	5000	11500	తెల్లకాయలు	5000	10500

నేడు విద్యుత్‌సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్‌వీఎన్ కాలనీ, నేతాజీనగర్, తారకరామనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి 4 సెక్షన్ ఏఈ కె అంజనీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రూ అప్ చార్జీలను విరమించుకోవాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఇంధన సర్దు బాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై మోపిన భారాలను విర మించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గుజ్జన గుండ్ల సెంటర్‌లో నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ ట్రూ అప్ చార్జీలపేరిట రూ.8 వేల కోట్ల రూపాయలు వసూలు చేయాలని ప్రతి పాదన దుర్మార్గమని అన్నారు. అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామనే హామీ ఏమైందని ప్రశ్నించారు. పెంపుదల నిర్ణయం విరమించుకోవాలని లేనిపక్షంలో ప్రజా ఆగ్రహానికి గురవుతారని అన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం ఎ చిష్టి, బి ముత్యాలరావు, షేక్ ఖాశిం షహీద్, ఆది నికల్సన్, షేక్ ఖాశింవలి, గోనె లూథర్ పాల్, షేక్ బాషా, ఎ కళ్యాణి పాల్గొన్నారు.

21న సమకాలీన రాజకీయ పరిణామాలపై సభ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఈ నెల 21న సమకాలీన రాజకీయ పరిణామాలపై స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, చిష్టీ, కిరణ్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విలువలకు కట్టుబడిన రతన్ టాటా

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిబద్ధత, దార్శనికత, అసాధారణ నైతిక నిష్ఠతతో అత్యున్నత విజయాలు సాధించిన అసామాన్యుడు రతన్‌టాటా అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ప్రశంసించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ కన్సల్టెంట్ వీవీ రావ్, అశోక్, దిలీప్, రామకృష్ణారెడ్డి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



సాంకేతిక సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

వీవీఐటీలో ప్రయుక్తి 2024 సాంకేతిక సదస్సు

పెదకాకాని, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ ,నిర్మాణభ్రష్ట విద్యార్థి విభాగము ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు ప్రయుక్తి 2024 సాంకేతిక వేడుకలను ప్రముఖ కన్స్ట్రక్షన్ కంపెనీ కోట కార్పోరేషన్ చీఫ్ కన్సల్టెంట్ కోట సుమన్, ప్రిన్సిపల్ వై. మల్లికార్జునరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రెండురోజులపాటు జరగనున్న ఈ సదస్సులో క్లాష్ ఆఫ్ మైన్స్, క్రిప్టిక్ క్విస్ట్, స్ట్రక్చరల్ కనెక్టివిటీ, క్లాష్ ఆఫ్ క్యాడ్ అంశాలపై సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుండి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట సుమన్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీర్లు నిర్మాణాలలో అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వినియోగం ద్వారా నిర్మాణాల నాణ్యతను ఏవిధంగా తెలుసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. వీవీఐటీ ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, అడ్మిన్ డీన్ ఎస్. కుమారస్వామి, సివిల్ విభాగాధిపతి టి.శ్రీధర్ బాబ్, సంధానకర్త చందన సుఖేష్ పాల్గొన్నారు.

శంకర్ విలాస్ ఆర్‌వోబీకి రూ. 98 కోట్ల నిధుల మంజూరు హర్షణీయం

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న శంకర విలాస్ బ్రిడ్జి విస్తరణ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 98 కోట్ల నిధులను మంజూరు చేయటం హర్షణీయమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు అన్నారు. స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం 4వ మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్, ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, నితిన్ గడ్కరి చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నదని కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రానికి విశాఖ రైల్వే జోన్, పోలవరం, ప్రాజెక్టుకు ఇతర ముఖ్యమైన అన్ని ప్రాజెక్టులకు కేంద్రం తమ వంతు సహకారాన్ని సంపూర్ణంగా అందజేస్తుందన్నారు. నగరాభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన నిధులతో కొనసాగుతున్నదన్నారు. బ్రిడ్జి విస్తరణ పనులు పూర్తయితే నగరవాసుల ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గుతాయి అన్నారు. దీని అనుబంధంగా ముఖ్య ప్రధాన రహదారులు కూడా విస్తరణ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొత్తూరు వెంకట సుబ్బారావు, చెరుకూరి తిరుపతిరావు, కుమార్ గౌడ్, కొక్కెర శ్రీనివాస్, దారా అంబేద్కర్, దర్శనం శ్రీనివాస్, ఆవుల వెంకటేశ్వరరావు, తాడువాయి రామకృష్ణ, ప్రతాప ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

దశల వారీగా డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగింపు

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఏసీపీ మల్లికార్జున రావు, సిబ్బంది

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని డ్రెయిన్లపై ఆక్రమణలను దశల వారీగా తొలగిస్తామని, ప్రజా సౌకర్యార్థం ఆక్రమణదారులు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల, రైలుపేట ప్రధాన రహదారిలో డ్రెయిన్‌పై , రోడ్లపై ఉన్న ఆక్రమణలను ఏసీపీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక అక్రమ ఆక్రమణ దళం తొలగించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్లపై ఆక్రమణలను గుర్తించి, వాటిని వారంతట వారే తొలగించుకోవాలని తెలియచేశామని అన్నారు. తొలగించని ఆక్రమణలను ప్రజల ఇబ్బంది దృష్ట్యా పట్టణ ప్రణాళికాధికారులు తొలగిస్తారని స్పష్టం చేశారు. వార్డు సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో గుర్తించి, వాటి తొలగింపునకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. వర్షాల కారణంగా నగరంలోని ఏయే ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడ్డారో ఆయా ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ముమ్మరం చేయాలి

గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేకంగా చేపట్టిన 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని ముమ్మరం చేయాలని, డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన అధికారులు మరింత శ్రద్ధగా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవడానికే 90 రోజుల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, డ్రైవ్ పర్యవేక్షణకు విధులు కేటాయించబడిన 22 మంది సీనియర్ అధికారులు మరింత శ్రద్ధ చూపాలన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ని అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు, సిఎంఓహెచ్, ఎంహెచ్‌ఓలు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. డ్రైవ్‌లో భాగంగా స్పెషల్ ఆఫీసర్లు ఉదయం 5:30 గంటలకు, మధ్యాహ్నం 2-30 గంటలకు ప్రతీ శానిటరీ డివిజనుకు వెళ్ళి పారిశుధ్య కార్మికుడి హాజరు శాతం, వార్డు శానిటేషన్ కార్యదర్శుల పనిని తనిఖీ చేయాలన్నారు. నగరంలో సేకరించే చెత్తను ఎప్పటికప్పుడు కంపోస్ట్ యార్డ్ కి తరలించాలని, ట్రాక్టర్లు, ఆటోలపై మైకులు ఏర్పాటు చేసి రోడ్లపై చెత్త వేయకుండా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

వైసీపీ నేతల మాటలకు వందసార్లు తన్నాలి

● కనపర్తి శ్రీనివాసరావు



గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జాతీయ నేత చంద్ర బాబును వైసీపీ నేతలు కొడాలి నాని, ద్వారంపూడి, సాయిరెడ్డి, అంబోతు రాంబాబు, రోజారెడ్డి, వంశీలాంటి వారు మాట్లాడిన మాటలకు వారిని కూడా వందసార్లు తన్నాలనిపించిందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయడం సబబేనని, పట్టాభి చేసిన విమర్శలకు తన రక్తం మరిగి ఆయన్ను తన్నాలనిపించిందని సకల శాఖల మాజీ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబు కనుసైగ చేస్తే వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని ఐదు నిమిషాల్లో నేలమట్టం చేయగలమని హెచ్చరించారు. రౌడీషీటర్, మానవమృగం బోరుగడ్డ అనిల్ చేసిన ప్రతీ నేరం, అతను మాట్లాడిన ప్రతీ మాట వెనుక సజ్జల, సాయిరెడ్డి హస్తముందని ఆరోపించారు. అలాంటి నేరస్తుడికి గన్‌మెన్లను ఇచ్చిందెవరు, ఇప్పించిన దెవరో హోం శాఖ విచారణ జరిపి కఠినచర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. 'స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం' అని సజ్జల కొత్తగా మాట్లాడు తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

అభివృద్ధిపథంలో కూటమి ప్రభుత్వం

సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. శంకర్ విలాస్ ఆర్ఓబీకి కేంద్రం నుంచి నిధులు మంజూరైన నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చిత్రపటాలకు టీడీపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. రెండు దశాబ్దాలకు పైగా కాగితాలకే పరిమితమైన అరండల్ పేట రైల్వే ఓవర్ బ్రిడ్జికి సీఆర్ఐఎఫ్ పథకం కింద కేంద్రం నుంచి రూ. 100 కోట్ల నిధులను సాధించిన ఘనత కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కే దక్కిందని అన్నారు.



లేబర్ వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

లేబర్ వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని బాగుచేయాలి: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గత కొన్ని దశాబ్దాలుగా చెట్లు, తుప్పలు, ముళ్ళపొదలు, మురుగు నీటితో ఉన్న గుంటూరులోని లేబర్ వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని బాగుచేసి, దాన్ని పలు అభివృద్ధి పనులకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు కాకుమానివారితోట వద్ద గల 13.58 ఎకరాల కార్మిక శాఖ స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు, ఇందులో 6.15 ఎకరాల స్థలం ప్రభుత్వాసుపత్రికి కేటాయయించామని, పది రోజులలో ఈ స్థలాన్ని రూ.90 లక్షల రూపాయల ఖర్చుతో ప్రహరీ నిర్మిస్తామని, అక్కడ ప్రభుత్వాసుపత్రికి చెందిన ఆప్తమాలజీ, డెంటల్, ఈఎన్‌టీ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారు. వారం రోజుల్లోగా మొత్తం 13.58 ఎకరాల స్థలంలో చెట్లు కొట్టించి శుభ్రం చేసి చదును చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. 5 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, ఆ మొత్తం స్థలం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, గోళ్ళ ప్రభాకర్, నరసింహారావు, రమేష్, ఏడుకొండలు, నరేష్, ఆనంద్, నాయుడు మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

● టీడీపీ నగర అధ్యక్షుడు దేగల



గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని తెలుగుదేశంపార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ అర్బన్ కార్యా లయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రగతికి పాటు పడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలతో 'ఇది మంచి ప్రభుత్వం' అని పించు కుంటోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్షోభంలో ఉన్నప్పటికీ సం క్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రశంసించారు. పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం దిశగా ఏపీ అభివృద్ధి చెందడానికి కేంద్రం సహకరిస్తోందన్నారు. ఒకవైపు అమరావతి రాజధాని, మరోవైపు పోలవరం నిర్మాణం పనులను వేగంగా పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధికి బాటలు వేసేలా కృషి చేస్తున్నారన్నారు.



బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్

బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో సీతారామయ్య హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఈస్ట్ గోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించిన తొమ్మిదవ సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ శుక్రవారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు బాస్కెట్‌బాల్ క్రీడాకారుల బాలుర విభాగంలో ఎ.శశి, టి.షణ్ముఖ్, టి.గణేశ్వర్, బాలికల విభాగంలో ఎ.అక్షయ, పి. శరణ్య కాంస్య పతకాలను సాధించినారని తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే క్రీడలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, వారికి ఉత్తమ శిక్షణ ఇచ్చిన కోచ్ రవిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, గింజుపల్లి వరప్రసాద రావు , అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎర్రచెరువు జోలికొస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

● ఏపీ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రజకులకు సంబంధించి పాత గుంటూరులోని ఎర్రచెరువు జోలికొస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని ఆంధ్ర ప్రదేశ్ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పాతగుంటూరు గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఐదు ప్రాంతాల్లో ఉన్న రజకుల వృత్తికి కేంద్రంగా ఉన్న ఎర్రచెరువుపై కొందరు స్వార్థపరులు అన్యాయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. శనివారం ఉదయం గంగానమ్మ కమ్యూనిటీ హాల్లో రజకుల బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఉమా మహేశ్వర రావు, శ్రీనివాసరావు, సాంబయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధం

● 50 శాతం పరిమితి మించుతుంటే సుప్రీంకోర్టు ఎలా సమర్థిస్తుంది?
● రిజర్వేషన్లపై కుట్రలు సహించం
● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు సామాజిక న్యాయసూత్రానికి విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు స్పష్టం చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించకూడదని గతంలో స్పష్టం చేసిన సుప్రీంకోర్టు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల పేరుతో 10 శాతం ఇస్తూ, పరిమితి మించిపోయేలా కేంద్రం చట్టం చేస్తే సుప్రీంకోర్టు నేడు ఎలా సమర్థిస్తుందని ప్రశ్నించారు. 3:2 నిష్పత్తి మెజారిటీతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల చట్టబద్ధతను, 'సుప్రీం' ఎలా సమర్థిస్తుందని విమర్శించారు. రాజ్యాంగ ప్రకరణలు 15(4),16(4) ప్రకారం సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు వర్తిస్తాయని, నేడు రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి విరుద్ధంగా,ఆర్థిక ప్రాతిపదికన అధిపత్య కుల పేదలకు ఈడబ్ల్యూఎస్ పేరిట రిజర్వేషన్లు ఇవ్వడం, సామాజిక న్యాయ సూత్రాన్ని అపహాస్యం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు ఆధిపత్య కుల పెత్తందారీ వర్గాలలో ఆర్థికంగా వెనుకబడిన పేదలు 10 శాతం కూడా ఉండరని, పైగా వారెవరు ఎప్పుడు అడగకుండానే, ఎట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టకుండానే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అత్యుత్సాహంతో 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ, ఈడబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు ఇవ్వడం అణగారిన రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం చేయడానికేనని ఆయన మండిపడ్డారు. ఇలా అన్యాయానికి పాల్పడడం వెనుక భవిష్యత్తులో అసలు రిజర్వేషన్లు ఎత్తేసే కుట్రలో భాగమేనంటూ కేసన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లా డుతూ నిజంగా అగ్రకుల పేదల ఆర్థికాభివృద్ధి పై చిత్త శుద్ధి ఉంటే ప్రభు త్వాలు తమ బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించి, ఆర్థిక పరమైన పథకాల ద్వారా ఆయా వర్గా లను అభివృద్ధి చేయవచ్చన్నారు. అందుకే గతంలో కేశవానంద భారతి కేసును 13 మంది జడ్జిలతో విచారించినట్లే, తమ అభ్యర్థనను సుమోటోగా స్వీకరించి, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కూడా తొమ్మిది మంది జడ్జిలకు మించిన విస్తృత ధర్మాసనంతో విచారించాలని, అణగారిన వర్గాలకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు, క్రాంతికుమార్ తదితరులు

శుభం కోల్డ్‌స్టోరేజ్ బాధితులకు బీమా చెల్లించేలా చూడాలి

● నష్టపోయిన రైతులకు పరిహారం అందజేతపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుగ్గిరాలలో శుభం కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద ఘటనలో నష్టపోయిన రైతులకు వీలైనంత త్వరగా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి క్లెయిమ్‌లు అందించేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేతపై న్యూ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ, రెవెన్యూ, అగ్ని మాపక, వ్యవసాయ మార్కెటింగ్, బ్యాంకు అధికారులు, శుభం కోల్డ్ స్టోరేజీ యాజ మాన్యంతో సమీక్ష నిర్వహించారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు మాట్లా డుతూ అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టంపై సర్వే పూర్తి చేశామని, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ తదితర శాఖలతో పాటు, కోల్డ్ స్టోరేజీ యాజ మాన్యం నుంచి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొని సోమవారం నాటికి కంపెనీ ప్రధాన కార్యా లయానికి ఫైలు పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లకు సంబంధించి అన్ని అం శాలపై తెనాలి సబ్ కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు తెలియజేస్తే తగు చర్యలు తీసుకుంటారని చెప్పారు. సమీక్షలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, కలెక్టరేట్ 'హెచ్' సెక్షన్ పర్యవేక్షకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.



వీధి బాలల పునరావాసం పై సమీక్ష నిర్వహిస్తున్న జేసీ భార్గవ్ తేజ

వీధి బాలల పునరావాసంపై దృష్టి సారించాలి: జేసీ

గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లోని వీధి బాలల పునరావాసంపై అధికారులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో వీధి బాలల పునరావాసం, సంక్షేమంపై శుక్రవారం జేసీ సమీక్ష నిర్వహించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సూచించారు. అక్టోబర్ నుండి డిసెంబర్ వరకు వీధి బాలల కోసం తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

ప్రతి నెలా 9న హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

● డీఎంహెచ్‌వో వెల్లడి

గుంటూరు మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హై రిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రతి నెలా 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల చేత వారికి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో హై రిస్క్ గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని, హైరిస్క్ గర్భిణులను సూపర్‌వైజర్లకు ట్యాగ్ చేయాలని తెలిపారు. ప్రసవానికి ముందే బర్త్ ప్లాన్ చేసుకోవడం, రవాణా వసతులు ఏర్పాటు చేసుకోవడం, రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ప్రసవ సమయంలో అవసరం మేరకు రక్తదానం చేసే బంధువులను సిద్ధంగా ఉంచడం చేయాలని చెప్పారు. ప్రతి గర్భిణి ఈ-సంజీవిని యాప్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా వైద్యులతో పరస్పరం చర్చించి వారి ఇచ్చే ఆరోగ్య సలహాలు పాటించాలని, టిఫా స్కాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి గర్భిణీని అబా ఐడీలో నమోదు చేయాలని, వర్షాకాలం దృష్ట్యా దోమల నివారణ చర్యలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీ సర్లు డాక్టర్ ఎస్ శ్రావణ్‌బాబు డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్, డాక్టర్ ఈ.అన్నపూర్ణ, పద్మజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్, పాల్గొన్న దేగల ప్రభాకర్ తదితరులు

మానవ హక్కులను పరిరక్షించాలి

● హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ టి.ప్రసన్నకుమార్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ టి.ప్రసన్నకుమార్ సూచించారు. స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్లో శుక్రవారం హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమా వేశానికి ముఖ్యఅతిథిగా నగర టీడీపీ అధ్యక్షుడు దేగల ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా చైర్మన్‌గా కసుకుర్తి హనుమంతరావు, జాతీయ మహిళా విభాగం చైర్ పర్సన్‌గా వాసిరెడ్డి ప్రసన్న రాధిక, డ్రగ్స్ అండ్ క్రైమ్ విభాగపు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పల్లపు శివరామ కృష్ణారావులకు దేగల ప్రభాకర్ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సాయంతో మానవ హక్కుల రక్షణకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. దేగల ప్రభాకర్ మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్‌కు టీ డీ పీ అం డగా ఉంటుందని హామీ ఇచ్చారు. కసుకుర్తి హనుమంతరావు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నివారణకు ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీ డీ పీ నాయ కులు మద్దిరాల మ్యానీ, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రెండు రోజుల పోలీస్ కస్టడీకి మాజీ ఎంపీ నందిగం సురేష్

● విచారించనున్న తుళ్లూరు పోలీసులు
● 2020లో వెలగపూడిలో ఓ మహిళ హత్య కేసులో నిందితుడు సురేష్

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ లో ఉన్న బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను రెండు రోజుల పోలీస్ కస్టడీకి మంగళగిరి కోర్టు అనుమతించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. శనివారం 11 గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు సురేష్‌ను పోలీస్ కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులోనూ సురేష్ నిందితుడిగా ఉన్నారు. గత నెల 5న మంగళగిరి రూరల్ పోలీసులు హైదరాబాదులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరిచి ఆయన రిమాండ్‌కు తరలించారు. గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న సమయంలో ఈ దాడి కేసుకు సంబంధించి మంగళగిరి రూరల్ పోలీసులు విచారించారు. కాగా, ఆ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు అయింది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వెలగపూడిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ మహిళ మృతి చెందింది. అప్పట్లో బాపట్ల ఎంపీగా ఉన్న ఆయన, రాజధాని ప్రాంతంలో స్థానికుడు కావడంతో ఆ ప్రాంతం కేంద్రంగా తన అధికార దర్పాన్ని ప్రదర్శించారు. ఆ సమయంలో ఆయన అనుచర వర్గం మరింతగా రెచ్చిపోయింది. సురేష్ ప్రోద్బలంతోనే ఆయన అనుచర వర్గం దాడికి దిగడంతో మరియమ్మ అనే మహిళ మృతి చెందినట్లు మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లోనే పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో నందిగం సురేష్ ఎంపీగా ఉండడంతో పోలీసులు ఆ కేసులో ఆయన పేరును చేర్చినప్పటికీ ఈ విషయం బయటకు రాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ కేసును బయటకు తీసి విచారించడంతో సురేష్ కూడా నిందితునిగా ఉన్నట్లు తేలింది. వాస్తవానికి ఆ కేసులో నందిగం సురేష్ ఏ1 గా ఉండాల్సి ఉన్నప్పటికీ, అప్పట్లో పోలీసులు ఆయనకు తొత్తులుగా వ్యవహరించి నిందితుల జాబితాలో ఆయన పేరు చేర్చలేదని పోలీస్ వర్గాలు అంటున్నాయి. సురేష్ ప్రోద్బలంతోనే ఈ హత్య జరిగినట్లు అప్పట్లో బాధితులు ఫిర్యాదు చేశారు. పంచనామాలో కూడా సురేష్ పేరు చెప్పారు. అయినప్పటికీ పోలీసులు నిందితుల జాబితాలో ఆయన పేరు పేర్కొనకుండా ముగ్గురి పేర్లు మాత్రమే నమోదు చేసి ఫిర్యాదులో పేర్కొన్న మిగిలిన నిందితులు అని రాశారు. కనీసం 37వ నిందితునిగా కూడా చేర్చలేదు. ఆ తరువాత విచారణలో ఈ కేసులో మరో 41 మందిని నిందితులుగా చేర్చారు. దీంతో నిందితుల జాబితా 77కు చేరింది. దీంతో, సురేష్‌ను 78వ నిందితునిగా చేర్చి విచారణ ప్రారంభించారు. విచారణ అనంతరం చార్జ్‌షీట్‌లో సురేష్‌ను ఏ1 గా చేర్చే అవకాశం ఉంది. జిల్లా జైల్లో టిడిపి కేంద్ర కార్యాలయం పై దాడి కేసులో రిమాండ్ లో ఉన్న నందిగం సురేష్ కు బెయిల్ మంజూరైనప్పటికీ తుళ్లూరు పోలీసులు మరియమ్మ హత్య కేసులో పిటి వారెంట్ పై కోర్టులో హాజరు పరచడంతో ఆయనకు 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో ఆయనను తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. కాగా ఆ కేసులో ఆయనను విచారించేందుకు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు మంగళగిరి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయగా ఇరుపక్షాల వాదనల అనంతరం ఆయనను రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 11 గంటలకు ఆయ నను గుంటూరు జిల్లా జైలు నుంచి తుళ్లూరు పోలీసులు కస్టడీ లోకి తీసుకోనున్నారు. తిరిగి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయనను జిల్లా జైలులో హాజరు పరచాల్సి ఉంటుంది.

ఊరే వృద్ధాశ్రమం





గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మా పిల్లలు బాగా చదువుకోవాలి.. మంచి ఉద్యోగం సాధించాలి.. విదేశాల్లో స్థిరపడాలి. మంచి స్థాయిలో ఉండాలి. ఇవీ పిల్లల విషయంలో తల్లిదండ్రుల కలలు. ఆశలు. ఆ కలలు సాకారం అయ్యాక అమ్మానాన్నల పరిస్థితి ఏమిటి. పిల్లలు బాగా చదువుకుని విదేశాలకు వెళ్తున్నారు బాగానే ఉంది. మరి ఊర్లో ఉంటున్న అమ్మానాన్నలు ఏమవుతున్నారు. ఎటూ వెళ్లలేక.. ఒంటరిగా ఉండలేక.. అందనంత ఎత్తుకు ఎదుగుతున్న పిల్లలను అందుకోలేక.. పిల్లలు వెళ్లిన దారుల వెంట వెళ్లలేక.. ఉన్న ఊరులో వారి కోసం ఏళ్లుగా ఎదురు చూస్తూ ఉసూరుమంటున్నారు. అటువంటి తల్లిదండ్రులు ఎక్కువ మంది ఉన్న ఒక గ్రామమే గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని అన్నవరం. ఇక్కడ అన్నిటికీ సమృద్ధే.. ఊరిలో ఉన్న అమ్మానాన్నలకు అన్నీ ఉన్నాయి. ఒక్క పిల్లల సాంగత్యం తప్ప. ఈ ఊరిని చూశాక.. ఒంటరిగా ఉన్న పెద్ద వాళ్ళ కథలు.. గాధలు విన్నాక.. పిల్లలు పెద్ద వాళ్లు కావాలని కోరుకోవాలి కానీ మరీ అందనంత దూరం వెళ్లాలని మాత్రం కాదని అర్థమవుతోంది. ఇది ఒక్క అన్నవరం గ్రామంలో మాత్రమే కాదు. పరిశీలిస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అన్నవరంలో సుమారు 450 కుటుంబాలు ఉంటాయి. ఇంటికి ఒకరిద్దరు అమెరికా, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పిల్లలు రెక్కలొచ్చిన పక్షుల్లా వెళ్ళిపోతే వృద్ధ తల్లిదండ్రులు ఒంటరిగా మిగిలిపోయారు. వారికి తినడానికి.. ఉండడానికి కొదవ లేదు. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడే అవస్థలు. ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేరన్న దిగులు. అన్ని ఇళ్లలో ఇదే పరిస్థితి.

చనిపోయినా దిక్కులేదు..



గ్రామంలో ఇటీవల ఓ మధ్య వయస్కురాలు అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పిల్లలు అమెరికాలోనే ఉన్నారు. వాళ్లు రావడానికి కుదరలేదు. దీంతో దూరపు బంధువులే దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఇది జరిగాక ఇంటినట్టిపెట్టుకుని ఉన్న పెద్దలకు దిగులు మొదలైంది. అయినా ఏం చేస్తారు.. పిల్లలు సంపాదన కోసం బయటకు వెళ్లక తప్పదు.

పండుగా.. పబ్బం..

దసరా పండుగకు కొందరు గ్రామానికి వచ్చారు. పెద్దల్లో సంబరం. అయితే ఆ ఉత్సాహం కొద్దిరోజులే. వచ్చేంత వరకు రావడంపై ధ్యాస.. వెళ్లేంత వరకు వెళ్లడం మీద ధ్యాస. గడిపింది కొద్ది గంటలే అయినా సంవత్సరానికి సరిపడా జ్ఞాపకాలు. విదేశాల్లో ఉన్న వాళ్ళు మాత్రం రాలేక పోయారు. కుదిరితే సంక్రాంతికి వస్తామని చెప్పారు. ఇంకేముంది ఇక్కడున్న అమ్మా నాన్న కి అప్పుడే పండుగ.

ఒంటరి బతుకు : గద్దె సింగయ్య, అన్నవరం



నేను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశా. భార్య, కుమార్తె ఉన్నారు. భార్య నాతో లేదు. ఉన్న కుమార్తెకు వివాహం జరిపించా. పెళ్లి కాకముందే పిల్ల మీద మనకి హక్కు. పెళ్లి అయితే వాళ్ల జీవితం వాళ్లది. ఒంటిరిగా ఒక్కడినే వండుకుంటా. మనవళ్లు అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. అప్పుడే ఒంటరి బతుకు అలవాటైంది. దేవుడు ఉంచిన వరకు ఇలా ఉండటమే.

పిల్లల దగ్గర ఉండలేము : పి ఎర్రయ్య, అన్నవరం



మా పిల్లలు టౌన్‌లో ఉంటారు. మేము మాత్రమే ఇక్కడ ఉంటాము. వాళ్ళ దగ్గర ఉండలేము. సొంత ఊరు అయితే పొద్దు పోతుంది. పట్టణంలో అలా కాదు. పిల్లలు మమ్మల్ని బాగా చూసుకుంటారు. వాళ్లే వచ్చి చూసి పోతారు. వయస్సు అయిపోయాక అన్నీ కావాలంటే దక్కవు మరి.

పాపం పండుటాకులు..

అన్నవరంలో ఓ వృద్ధ జంట దుస్థితి గురించి ఓ యువకుడు అనుభవం

నా బాల్య మిత్రుడు అమెరికాలో పెద్ద డాక్టర్. అంతులేని సంపద. పొద్దస్తమానం ఫోన్ చెయ్యడు. రెండు నెలలకు ఒకసారి అదీ అర్థరాత్రి ఫోన్ చేసి అన్నవరంలో ఉన్న అమ్మా, నాన్న దగ్గరికి వెళ్లి రమ్మంటాడు. నేనూ వాడు పెదనందిపాడు స్కూల్లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నాం. ఇద్దరం మంచి మార్కులతో పాసైనా నా చదువు ముందుకు సాగలేదు. నాన్న చేతి కింద ఉండి వ్యవసాయం చేయాల్సి వచ్చింది. వాడేమో డాక్టర్ అయ్యాడు. వాడ్ని అమెరికా పంపడం వాళ్ల నాన్న కల. అది నెరవేరింది. కానీ వాళ్ళకి వీడు ఒక్కడే కావడం వల్ల ఒక వయస్సు వచ్చేటప్పటికీ ఇబ్బందులు మొదలయ్యాయి. తల్లి తండ్రులకు బీపీ, షుగరు, గుండెజబ్బులు. తరాలు తిన్నా తరగని ఆస్తులున్నాయి. కానీ ఏమీ లాభం. లేచినా, లేవక పోయినా ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేరు. చుట్టాలు, బంధువులు ఉన్నారు. అయితే వారు రోజుల తరబడి అంటిపెట్టుకుని ఉండలేరుగా. అయినా ఎందరున్నా ఏమి లాభం. కడుపున పుట్టిన బిడ్డ పక్కన ఉంటే ఆ లెక్కే వేరు. అలా అని వీళ్లు అక్కడకి వెళ్లలేరు. పోనీ వాడు ఇక్కడికి రావాలన్నా కుదరదు. అందుకే నాకు వారిని చూసి వచ్చే పనిని పురమాయిస్తుంటాడు. ఆ పెద్దాయనికి పాలతాలికులు అంటే చాలా ఇష్టం. పెద్దమ్మకి బూందీ అంటే మక్కువ. కానీ చేసుకునే ఓపిక వారికి లేదు. పెద్దాయన చిన్న ముక్కాల పీట తెచ్చి వేస్తే పెద్దమ్మ దాని మీద కూర్చుని ఇద్దరికీ రెండు మెతుకులు వండుతుంది. నేను వెళ్ళేటప్పుడు వారికి ఇష్టమైన వాటిని ఇంట్లో చేయించి తీసుకువెళ్తే ఎంత ఇష్టంగా తింటారో. ఊర్లో వాళ్లందరికీ నా గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటారు. దేవుడిచ్చిన కొడుకంటారు.

గుంటూరు మీదగా శబరిమలకు భారత గౌరవ రైలు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శబరిమల పుణ్యక్షేత్రానికి గుంటూరు మీదగా భారత గౌరవ రైలుని నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. నెంబరు. ఎస్‌సీజెడ్‌బీజీ32 (శబరిమల యాత్ర) కోడ్ రైలు నవంబరు 16వ తేదీన సికింద్రాబాద్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి 10.40కి నల్గొండ, మధ్యాహ్నం 1 గంటకు పిడుగురాళ్ల, 2.45కి గుంటూరు, 3.25కి తెనాలికి చేరుకొని శబరిమలకు వెళుతుంది. యాత్రలో భాగంగా సన్నిధానంలో అయ్యప్పస్వామి దర్శనం, ఆ తర్వాత చొట్టానికర సందర్శన ఉంటుందన్నారు. మొత్తం నాలుగు రాత్రులు, ఐదు పగటిపూటల ప్రయాణం ఉంటుందని సంస్థ తెలిపింది. ఎకానమి, స్టాండర్డ్, కంఫర్ట్ క్లాసులు ఉంటాయని, యాత్ర పూర్తి వివరాల కోసం సీహెచ్ బాలాజీ(9281030714), ప్రవీణ్ నాయక్(9281495848)లను సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

రెండు రైళ్ల రద్దు

మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా నవంబరు 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నెంబరు. 07792 నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని నవంబరు 21, 22 తేదీల్లో 75 నిమిషాల ఆలస్యంగా బయలుదేరేలా రేపల్లెలో రీషెడ్యూల్ చేయడం జరిగిందన్నారు.

నేడు జ్యోత్స్న సంస్మరణ సభ

గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సామాజిక ఉద్యమకారిణి గుళ్ళపల్లి జ్యోత్స్న సంస్మరణ సభ శనివారం జరగనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. మంగళగిరి డీజీపీ కార్యాలయం సమీపంలోని సి.కె. కన్వెన్షన్ నందు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుళ్ళపల్లి జ్యోత్స్న ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విదితమే. ఆమె ప్రముఖ న్యాయవాది, అల్ ఇండియా లాయర్స్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్ సతీమణి. జ్యోత్స్న విద్యార్థి దశ నుండి అభ్యుదయ భావాలతో పని చేస్తూ, సారా వ్యతిరేక ఉద్యమం, మహిళల హక్కుల కోసం, విద్యార్థినుల సమస్యలపై, సమానత్వం కోసం అనేక సంఘాలను ఏర్పాటు చేసి వారి అభ్యున్నతి కోసం పాటుపడ్డారు.

ఇంతవరకు... బోరుగడ్డ ముఖమే చూడలేదు

వైసీపీ నేతలు, బోరుగడ్డ మైండ్ గేమ్‌లో భాగంగానే నా పేరు వెల్లడి.. మాజీ మంత్రి, టీడీపీ నేత మోపిదేవి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసిపి ప్రభుత్వ హయాంలో సోషల్ మీడియాలో అసభ్యకరమైన, దారుణమైన వ్యాఖ్యలతో ప్రతిపక్ష నేతలను, మహిళలను కించపరిచేలా పోస్టింగ్స్ పెడుతూ చెలరేగిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌ను తాను ఒక్కసారి కూడా చూడలేదని మాజీ మంత్రి, టిడిపి నేత మోపిదేవి వెంకట రామారావు స్పష్టం చేశారు. బోరుగడ్డ అనిల్ కుమార్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించిన సమయంలో తాను నాడు వైసిపి నేతలైన మోపిదేవి వెంకటరమణ, ఆయన సోదరుడితోపాటు లేళ్ళ అప్పిరెడ్డి ప్రోత్సహించినందునే వారిని తిట్టానని చెప్పాడు. అయితే బోరుగడ్డ అనిల్ పోలీసుల విచారణలో తన పేరు చెప్పడంతో ఆశ్చర్యానికి గురయ్యానని మోపిదేవి స్పష్టం చేశారు. ఏనాడు నేను అనిల్ ముఖమే చూడలేదని స్పష్టం చేశారు. నేను వైసీపీని వీడి టీడీపీలో చేరడం ఇష్టం లేని వారే అనిల్ తో తన పేరు చెప్పించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తాను వైసీపీలో ఉన్నప్పుడు కూడా ఎప్పుడు ఇటువంటి దుర్మార్గ పనులను ప్రోత్సహించలేదన్నారు. సీఎం చంద్రబాబు పవన్ కళ్యాణ్ లోకేష్ లతోపాటు పలువురు ముఖ్య నేతలను మహిళలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో దారుణంగా దూషించిన అనిల్ కుమార్ ఆయా నేతల, పార్టీల కార్యకర్తల దృష్టి మరల్చేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేసి ఉంటాడన్నారు. తాను ఏనాడు బోరుగడ్డ అనిల్ ముఖం కూడా చూడలేదని అటువంటి వ్యక్తితో నా పేరు చెప్పించారంటే వైసీపీ నాయకులు, బోరుగడ్డ అనిల్ ఆడుతున్న మైండ్ గేమ్‌లో భాగమై ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

నరసరావుపేటలో... కొలిక్కిరాని వివాదం

- 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని పట్టు
- బాటిల్‌కు అదనంగా రూ. 10 వసూలు

నరసరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట తెలుగుదేశం పార్టీలో నెలకొన్న మద్యం షాపుల వివాదం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. 50 శాతం షాపుల్లో వాటాలు కోరుతున్న టీడీపీ నేతలు వ్యాపారులు షాపులు ప్రారంభిస్తున్నా మిన్నకున్నారు. నరసరావుపేట పట్టణంలో 7 షాపులకుగాను మూడు షాపులు మాత్రమే ప్రారంభించారు. షాపుల్లో వాటాల కోసం పార్టీ శ్రేణులు నుంచి వసూలు చేసిన మొత్తాలను తిరిగి ఇచ్చేందుకు సదరు నేతలు సిద్ధమైనట్టు ప్రచారం. రెండు రోజుల్లో షాపులు వ్యవహారం ఒక కొలిక్కి వస్తుందని అప్పటి వరకు వేచి చూద్దామని డబ్బు వెనక్కు తిసుకోలేదని డబ్బు చెల్లించిన వ్యక్తులు తెలిపారు. ఒక మద్యం షాపులో 5 శాతం వాటా రూ. 7.50 లక్షలుగా నిర్ణయించి పార్టీ శ్రేణుల నుంచి డబ్బు వసూలు చేసినట్టు చెబుతున్నారు. టీడీపీలోని ఒక వర్గం ఒక షాపు, మరో వర్గం రెండు షాపులను పట్టణంలో ప్రారంభించారు. ఇంకా నాలుగు షాపులను ప్రారంభించాల్సి ఉంది. టీడీపీలో మద్యం షాపుల రచ్చ ఇంకా సమసిపోలేదన్న వాదన వినిపిస్తోంది. అయితే కొందరు నేతలు ఇరు వర్గాలో చర్చలు జరిపినట్టు తెలిసింది. నియోజకవర్గంలో అన్ని షాపులు ప్రారంభించిన తర్వాత వాటాల సంగతి చర్చిద్దామని కొందరు పార్టీలోని పెద్దలు ఇరువర్గాలతో చర్చలు జరిపిన నేపథ్యంలోనే పట్టణంలో మూడు షాపులు ప్రారంభమయ్యాయని చెబుతున్నారు.

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బాటిల్‌కు రూ 10 నుంచి రూ 20 కి అదనంగా షాపుల నిర్వాహకులు వసూలు చేశారు. ధరలు తగ్గుతాయని ఆశపడ్డ మందుబాబులు పాత ధరలకే మద్యం విక్రయిస్తుండటంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. షాపుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేసిన వ్యాపారులు అదనపు ధరలకు మద్యం విక్రయించకపోతే తమకు గిట్టుబాటు కాదన్న వాదన వినిపిస్తున్నారు. గ్రామల్లో మద్యం బెల్టు షాపులకు గిరాకి పెరిగింది. వ్యాపారులు ఎవరికి పట్టు ఉన్న గ్రామంలో వారు మద్యం బెల్టు షాపులు నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లో గ్రామాల్లో బెల్టు షాపులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామని వ్యాపారులే బహిరంగంగా చెబుతున్నారు. పట్టణాల్లో కూడా బంకుల్లో కూడా బెల్టు షాపులు వెలవనున్నాయి.



6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న నీటి విడుదల

- సాగర్ నుంచి ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు..

మాచర్ల రూరల్, రెంటచింతల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తుతుంది. దీంతో సాగర్ నుంచి దిగువనకు నీటి విడుదల మూడో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. సాగర్ ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం ఆరు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 48,540 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నీటి మట్టం 589.90 అడుగులు ఉంది. ఇది 311.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3371, ఎడమ కాలువ ద్వారా 6173, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,556, క్రస్ట్‌గేట్ల ద్వారా 48,540, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 400 మొత్తం ఔట్‌ఫ్లో 89,840 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 89,740 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు భారీగా వరద

సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సాగర్ నుంచి 75 వేల క్యూసెక్కుల వరద నీరొస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటేశ్వరరావు, ఈఈ సుబ్రహ్మణ్యం శుక్రవారం చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 4 గేట్లను 2 మీటర్లు, 2 క్రస్ట్‌గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 69 వేల క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ తయారీ అనంతరం టీఆర్‌సీ(టేల్ రేస్ ఛానల్)ద్వారా 8420 మొత్తంగా 77420 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.007 ఎంయూ(మిలియన్ యూనిట్లు) కరెంట్ తయారైందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పారిశుధ్యం.. స్కూల్ మేనేజ్‌మెంట్లకే..

- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతీ కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యుల పనుల పరిశీలన

గుంటూరు(విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల్లో చెత్తాచెదారాలు.. మరుగుదొడ్లలో దుర్వాసన.. అపరిశుభ్రత.. ఇదీ కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి. అధ్వాన పారిశుధ్యం మధ్యే విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలి. మరుగుదొడ్లకు వెళ్లే పరిస్థితులు కూడా కొన్ని పాఠశాలల్లో ఉండేవి కావు. ఇక ఈ పరిస్థితుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. బడుల్లో పారిశుధ్యం మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటి దాకా ఉపాధ్యాయులకు భారంగా మారిన పాఠశాలల పారిశుధ్య బాధ్యత ఇక యాజమాన్య కమిటీలకు అప్పగించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. అదేవిధంగా ప్రతీ పాఠశాలకు ఒక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 4233, జడ్పీ, ఉన్నత పాఠశాలలు 345 ఉన్నయి. ఆయా పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను ఇప్పటి వరకు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి అందులో రోజుకు మూడు సార్లు మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి ఐదేళ్ల అమలు చేసింది. దీనిపై రాష్ట్రం వ్యాప్తంగా ఉపాధ్యాయులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతేకాకుండా గత ప్రభుత్వం పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి తల్లి దండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు నెలవారీ జరిగే సమావేశాల్లో పాల్గొని తీర్మానాలపై సంతకాలు చేయడం, ఉత్సవ విగ్రహాల్లా ఉండటం మినహా ఎటువంటి అధికారాలు, బాధ్యతలు ఉండేవికావు. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యాజమాన్య కమిటీలను పునరుద్ధరించింది. ఇటీవల పాఠశాలల వారీగా ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ఈ కమిటీలకు కొన్ని బాధ్యతల్ని అప్పగించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పాఠశాలకు వచ్చి మరుగుదొడ్లు, ఇతర పారిశుధ్యం తదితరాలకు సంబంధించిన పనులను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక్కో కమిటీకి ప్రత్యేక ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించింది. ఒక్కో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో సగటున 15 నుంచి 20 మంది సభ్యులు ఉంటారు. వారితోపాటు సచివాలయ సంక్షేమ సహాయకులు పారిశుధ్య పర్యవేక్షణ పనుల్లో భాగస్వాములు కానున్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యాప్‌లో పారిశుధ్య నిర్వహణ ఫొటోలు అప్‌లోడు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఎక్కడైనా మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదించి సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పాఠశాలల్లో ప్రధానంగా ఉన్న పారిశుధ్య సమస్యకు పరిష్కారం లభించినట్లేనని అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు భావిస్తున్నారు.



పాఠశాలలో మూత్రశాలలు

రెండో రోజు ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



వర్షంలోనూ.. పరుగులు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 35వ సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు పతకాల కోసం పరుగులు పెట్టారు. 200 మీటర్ల పరుగు, పది వేల మీటర్ల పోల్‌వాల్ట్, డిస్కస్‌త్రో, 400 మీటర్ల రిలే, జావలిన్ త్రో, 600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ తదితర అంశాలలో పోటీలు జరిగాయి. పోటీల నిర్వహణ కార్యదర్శి ఏ.గౌతమ్ కిరణ్, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ పర్యవేక్షించారు.


-పెదకాకాని, ఆంధ్రజ్యోతి)



సీఎం చంద్రబాబుతో ఎన్టీఆర్‌కి నివాళి అర్పిస్తున్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులు



ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, నక్కా ఆనందబాబు, కన్నా లక్ష్మీనారాయణ



ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర


అధినేతతో.. ప్రజాప్రతినిధులు

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశమయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి టీడీపీ అధినేత నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని నేతలు హాజరయ్యారు.

-మంగళగిరి, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు









ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, భాష్యం ప్రవీణ్, గల్లా మాధవి, తెనాలి శ్రావణ్‌కుమార్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

పొన్నూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ టి.అజిత కుమారి శుక్రవారం తెలిపారు. 9959225267 ఫోన్ నెంబర్‌కు ఫోన్‌చేసి సలహాలు సూచనలతో పాటు ఫిర్యాదులు తెలియజేయాల్సిందిగా డిపో మేనేజర్ కోరారు.



బ్రాహ్మణకోడూరులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

21న అష్టావధానం

పొన్నూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీన నిర్వహించే అష్టావధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బ్రాహ్మణ మహాసభ మాజీ అధ్యక్షుడు పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్ కోరారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు శంకరమఠంలో ఈ అష్టావధాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అద్దంకి పట్టణానికి చెందిన నారాయణం బాల సుబ్రహ్మణ్యం అవధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి సాహితీప్రియులు, తెలుగు భాషాభిమానులు, పట్టణ వాసులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో విశ్రాంత తెలుగు పండితులు ఎం కృష్ణ కిషోర్, దేశరాజు బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

20న అభివృద్ధి పనులకు శంకుస్థాపన: ఎంపీడీవో

తెనాలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకారం చుట్టనున్నారని మండల పరిషత్ కార్యాలయ పాలనాధికారి ఆచంట శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎరుకలపూడి, జగ్గడిగుంటపాలెం, కఠెవరం, కొలకలూరు బీసీ కాలనీ, మల్లెపాడు, సంగం జాగర్లమూడి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, శిలాఫలకాల ఆవిష్కరణ వంటివాటిని మంత్రి మనోహర్ ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

చేబ్రోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాకోడూరు పంట పొలాల్లో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని శుక్రవారం చేబ్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం నారాకోడూరు గ్రామ శివారులోని ఈస్ట్రన్ కంపెనీ వద్ద పంట పొలాల్లో సుమారు 50 ఏళ్ల వయస్సు వున్న వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్య

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాకపోవడంతో మనస్థాపం చెందిన భర్త పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన చావలి రాజేష్ (38) అనే వ్యక్తి వలివేరుకు చెందిన మహిళతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. రాజేష్‌కు మద్యం అలవాటు ఉండటంతో అతని ప్రవర్తన నచ్చక అలిగిన భార్య రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో గురువారం పురుగు మందుతాగి వలివేరులోని తన భార్య ఇంటికి వెళ్లి అక్కడ స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని టూ టౌన్ పోలీసులు తెలిపారు. రాజేష్ తల్లి భాగ్యమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకులపై దాడి

తెనాలి, క్రైమ్ 18 (ఆంధ్రజ్యోతి): బ్యానర్ తొలిగించారని అనుమానంతో యువకులపై కొందరు దాడిచేసిన సంఘటన ముత్తింశెట్టిపాలెంలో జరిగింది. ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు కథనం మేరకు కబేళాసెంటర్‌లో ఏర్పాటుచేసిన బ్యానర్‌ను గౌడ కాలనీకి చెందిన నీలం సాయితేజ తొలగించాడనే అనుమానంతో ముత్తింశెట్టిపాలెం చెందిన టి. రామకృష్ణ మరో నలుగురు యువకులు కలిసి తీవ్రంగా దాడిచేసి చిత్రహింసలకు గురిచేశారు. ఈ సంఘటనపై సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యూటీఎఫ్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రం

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఓటరు నమోదు కేంద్రం శుక్రవారం ప్రారంభించారు. కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికలకు అవసరమైన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు మల్లేశ్వరరావు కోరారు. పట్టభద్రులంతా మళ్లీ ఓటుకోసం దరఖాస్తు చేసుకోవాలని, గతంలో ఉన్న ఓటు రద్దవుతుందన్నారు. సీపీఎం నేత ఎం.శివ సాంబిరెడ్డి, గయాసుద్దీలా, కేదార్‌నాథ్, సాంబశివరావు, సతీష్, నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రయత్నాలు విరమించుకోవాలి: కొల్లిపర

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని సీపీఎం కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ కోరారు. చెంచుపేట ఈఈ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన చేసి ఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.8వేల కోట్ల రూపాయల మేరకు చార్జీలు పెంచేందుకు గాను డిస్కమ్‌లు రెగ్యులేటర్ కమిషన్‌కి విన్నవించాయన్నారు. ఇందుకోసం పబ్లిక్ హియరింగ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పెరిగిన చార్జీలు తగ్గిస్తామని తీరా అధికారంలోకి వచ్చాక వాటిని తగ్గించకపోగా కొత్తగా భారం మోపే ప్రయత్నాలు తగవన్నారు. ములకా శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, సాంబశివరావు, వెంకటసుబ్బయ్య, వెంకయ్య పాల్గొన్నారు.





జలాశయాలను తలపిస్తున్న కాలనీ, ముంపు నీటిలో ఉన్న కాలనీ, ఖాళీస్థలాల్లో నిలిచిన నీరు

ముంపులో కఠెవరం పంచాయతీ శివారు కాలనీ

● వర్షం నీరు నిలిచి ఇబ్బందుల్లో కాలనీవాసులు

● రక్షణ చర్యలకు ముందుకు రాని అధికారులు

తెనాలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కఠెవరం గ్రామ పంచాయతీ పరిధిలోని శివారు కాలనీ జలాశయాలను తలపిస్తోంది. నాలుగు రోజులుగా కాలనీలో నీరు చెరువులను తలపిస్తూ ఇంటిచుట్టూ, రోడ్లనిండా నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. తెనాలి బాలాజీరావు పేట అయ్యప్పపురం నుంచి కఠెవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఆ కాలనీలో దాదాపుగా 100-200 కుటుంబాలు నివసిస్తున్నారు. కాలనీకి కనీస సౌకర్యాలు లేకపోవడం, డ్రెయినేజీ వ్యవస్థపై అధికారులు పెద్దగా దృష్టిపెట్టకపోవడం వంటి పరిణామాలతో ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. వర్షం కురిసిన ప్రతిసారీ కాలనీ చెరువు మాదిరిగా మారుతూ కాలనీవాసులు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోతున్నది. అక్కడ నివసించే ప్రజలకు వర్షపు నీరు తగ్గేంతవరకూ బయటకు వచ్చేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. అత్యవసరమైతే వైద్యశాలకు వెళ్లేందుకు అంబులెన్స్‌లు సైతం రాలేని పరిస్థితి తమ ప్రాంతంలో చోటుచేసుకుందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. పిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కాలనీ నుంచి జీవనోపాధికి ద్విచక్రవాహనాలతో బయటకువెళ్లే సమయంలో వర్షం నీరు వాహనాల ఇంజన్లలోకి చేరి అవి మరమ్మతులకు గురవుతున్నాయని, నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా కలుషితమైన ఆ నీటిలో నుంచి నడిచి వెళ్లే పరిస్థితి నెలకొని ఉండటంపై ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రులైతే ఇంటి చుట్టుచేరిన నీటిలో నుండి విషపురుగులు సైతం ఇంటి గోడలపై చేరుతున్నాయన్నారు. కాలనీలో భయం భయంగా గడుపుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రోజులు తరబడి నీరు నిలిచి దోమలతో కాలనీ ప్రజలకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కాలనీ వాసులు ఇంత దుర్భరమైన జీవితం గడుపుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నీరు తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదని వారు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కాలనీలో ఇంటిచుట్టూ నీరు నిలిచి ఉన్నప్పటికీ పట్టణానికి చేరే మట్టిరోడ్డు కొంతమేర కనిపించడంతో రాకపోకలు జరుగుతుండగా వాతావరణ శాఖ మరో నాలుగు రోజులు వర్షాలున్నాయని హెచ్చరికల నేపథ్యంలో తక్షణ చర్యలు చేపట్టకుంటే రోడ్డు కూడా మునిగిపోయి రాకపోకలు పూర్తిగా నిలిచి తామంతా బిక్కుబిక్కుమంటూ గడిపే పరిస్థితి నెలకొననుందని వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి తమ కాలనీలో నీటిని బయటకు పంపి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపు సినీనటుడు బాలకృష్ణ నట స్వర్ణోత్సవం

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు నందమూరి బాలకృష్ణ నట స్వర్ణోత్సవంను ఆదివారం నిర్వహించనున్నట్లు స్వరలయ వేదిక వ్యవస్థాపకులు సాయిలక్కరాజు తెలిపారు. వేడుకల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించే వేడుకల్లో సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. సంగీత ప్రియులు, బాలకృష్ణ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విజయవాడ డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో పలువురు గాయకులు గీతాలు ఆలపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నపల్లి గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులలో అలసత్వం వద్దు

● అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు



అధికారులకు సూచనలు చేస్తున్న అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులలో అలసత్వం వద్దని పారిశుధ్య కార్మికులతో పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 23, 34వ వార్డులలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రతకు, ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ప్రజలు చెత్తను మురుగు కాలువలో, డ్రెయిన్‌లలో పోయరాదని పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వ్యర్థాలను రోడ్లపై నుంచి తొలగించాలని మున్సిపల్ కార్మికులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు నజీర్, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం



లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న స్వర్ణకారులు

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని సంఘం అధ్యక్షుడు గుళ్లపల్లి శ్రీనివాసరావు చెప్పారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పాదయాత్ర చేసిన సమయంలో స్వర్ణకారుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారని చెప్పారు. ఆ హామీని నెరవేర్చుకుని కార్పొరేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైందన్నారు. ప్రధాన కార్యదర్శి నాసర్ ఆహ్మద్, మునగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు యత్నాలను విరమించుకోవాలి: సీపీఎం

పెదకాకాని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ చార్జీల పెంపును విరమించుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నేతాజీ, శివాజీలు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు పెంచటానికి చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని పెదకాకాని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షతన ధర్నా జరిగింది. ధర్నా అనంతరం ఏ ఈ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వి.శివయ్య, కే సత్యనారాయణ, ఆర్.వెంకటరమణ, పూర్ణకంటి నాగమణి, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

అర్థవంతమైన బోధన సాగాలి: ఆర్జేడీ

పొన్నూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అవగతమయ్యే రీతిలో విద్యాబోధన అర్థవంతంగా సాగాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామలింగేశ్వర రెడ్డి అన్నారు. పట్టణంలోని వీఎస్ఆర్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్‌జీటీలకు శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గణితం, తెలుగు, పాఠ్యాంశాలను బోధించే విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన ఎస్‌జీటీలకు ఈ కళాశాల్లో ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ శిబిరాన్ని విద్యాశాఖ ఏడీ సుబ్బారెడ్డి ఎస్ఎల్ఎస్ కరస్పాండెంట్, బాలకృష్ణ, ప్రొఫెసర్ ప్రతీక్ష, డిప్యూటీ డీఈవో శాంత కుమారి, ఏంఈవో శ్రీనివాసరెడ్డి, వీఎస్ఆర్ కళాశాల నిర్వాహకులు వెలగ పద్మారావు, పరిశీలించారు.

మునగాకుతో రక్తహీనత దూరం

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు, బాలింత తల్లులకు ఏర్పడే రక్తహీనతను నివారించడానికి మునగాకు ఎంతో ఉపయోగపడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె సౌజన్యశ్రీ అన్నారు. ఐతానగర్‌లోని 40వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామాజిక వేడుకలలో భాగంగా తల్లులలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి వన్ సెక్టార్ సూపర్‌వైజర్ కె.సౌజన్యశ్రీ పాల్గొని తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునగాకుతో మూడు వందల రకాల వంటలు చేసుకోవచ్చని అందులో భాగంగా కొన్ని రకాల వంటలను తల్లులకు చేసి చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, జేఎంజే కళాశాల హోమ్ సైన్స్ విద్యార్థినులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు: వీరవల్లి

తెనాలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గంజాయి, అక్రమ మద్యం, రౌడీయిజం, అక్రమకేసులు, హత్యలు, డోర్ డెలివరీలతో రాష్ట్రం అట్టుడికిపోయిందని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి ఆరోపించారు. శుక్రవారం వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబు పాలనపై విమర్శలు చేయడాన్ని వీరవల్లి మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రజలు ఒక్కచాన్స్ అని అడిగిన జగన్‌మోహన్‌రెడ్డికి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారని మండిపడ్డారు. ఐదేళ్లలో కనీసం రోడ్లుకు మరమ్మతులు కూడా పూర్తిస్థాయిలో చేయించలేని అసమర్థపు ప్రభుత్వంగా వైసీపీ చరిత్రలో నిలిచిపోయిందని ఘాటుగా విమర్శించారు. వైసీపీ పాలనలో చేసిన తప్పిదాలను సరిచేసుకుంటూ వస్తు ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు.

ఏఎస్ఎన్ కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ కృషి: అన్నాబత్తుని

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఎన్ కళాశాల అభివృద్ధిలో ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ విశేష కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఈ ఏడాది వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లో జాతీయ స్థాయిలో కళాశాల మూడవ ర్యాంకు సాధించడం సౌత్‌జోన్‌లో ప్రిన్సిపల్ ఎక్సలెన్స్ అవార్డు పొందడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పేర్కొన్నారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రాంచంద్‌ను ఘనంగా సన్మానించారు. కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ హైమావతి, కృపాచారి, భూపాలరావు, ప్రసన్నలక్ష్మి, సురేష్‌బాబు, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం అమలు చేస్తునట్లు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మునిపల్లెలో రూ.4 లక్షలు, బ్రాహ్మణకోడూరులో రూ.5లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అలాగే మండల పరిధిలోని మామిళ్లపల్లిలో రూ.13.5 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మామిళ్లపల్లిలో ఇటీవల జరిగిన ఎన్నికలలో తన ప్రత్యర్థికి పెద్దఎత్తున మెజార్టీ వచ్చిందన్నారు. కానీ అభివృద్ధి, సంక్షేమం విషయంలో తమకు రాజకీయ వివక్షత లేదని స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మామిళ్లపల్లి నుంచి దండమూడి, కట్టెంపూడి, జీబీసీ రోడ్డు వరకు నిర్మించే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. అలాగే రూ.13.50 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఇది తమ చిత్తశుద్ధికి నిదర్శనం అని వివరించారు. ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను నెల రోజులలోనే ఆదుకుని కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వంగా గుర్తింపు పొందిందన్నారు. అలాగే పింఛన్ల పెంపుచేసి ఎన్నికల హామీని నెరవేర్చినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో కొత్త పింఛన్లు మంజూరు చేయనునట్లు వివరించారు. ప్రజలు కోరుకున్న అభివృద్ధి ప్రజల ముందుకు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, కూటమి పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మన్నవలో...

పొన్నూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో గ్రామాలు ప్రగతిబాట పడుతున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు అన్నారు. మండల పరిధిలోని మన్నవ గ్రామంలో రూ.5లక్షలు, దొప్పలపూడిలో రూ.6.50 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లకు శుక్రవారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు, రైతు విభాగం పార్లమెంట్ కార్యదర్శి బొర్రు రామారావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు మొవ్వ వెంకటకృష్ణ, మండల మహిళాధ్యక్షురాలు బుడ్డ శివమ్మ, బండ్లమూడి చింపిరయ్య, దొప్పలపూడి సాంబశివరావు, సజ్జా బ్రహ్మయ్య, మున్నంగి సుబ్బారెడ్డి, ఆరెమండ విజయకుమార్, చిలకా రవి, గరిగంటి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో చేపలు విక్రయించొద్దు

● అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బహిరంగ ప్రదేశాలలో చేపల అమ్మకాలు నిర్వహించొద్దని చేపల విక్రయదారులను పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు ఆదేశించారు. పట్టణ పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం చేపలు, రొయ్యలు విక్రయించే వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని మున్సిపల్ అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనం పరిశుభ్రతలకు అధిక ప్రాధాన్యమిస్తూ పురపాలక సంఘం పనిచేస్తోందన్నారు. అయితే చేపలు, రొయ్యల వ్యాపారులు బాధ్యతారహితంగా పట్టణంలోని ప్రధాన రహదారులపై విక్రయాలు జరిపి, వ్యర్థాలను రహదారుల పక్కన వదిలివేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్నారన్నారు. దీనివల్ల పారిశుధ్యం లోపించి ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వ్యాపారులు రోడ్ల వెంట విక్రయాలు చేయకుండా పట్టణంలో ఏర్పాటు చేసిన నిర్ణీత ప్రదేశాలలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. ఆదివారం ప్రధాన రహదారులపై వ్యాపారాలు నిర్వహిస్తే మున్సిపల్ చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని అసిస్టెంటు కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, చేపల విక్రయదారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకంపై శ్రద్ధ తీసుకోవాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకంపై ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చక్రాయపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఆకస్మికగా తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆ జాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆహార పదార్థాలు పిల్లలకు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

వీవీఐటీలో ప్రయుక్తి 2024 సాంకేతిక సదస్సు

పెదకాకాని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ప్రయుక్తి 2024 సాంకేతిక వేడుకలను కన్స్ట్రక్షన్ కంపెనీ కోట కార్పోరేషన్ చీఫ్ కన్సల్టెంట్ కోట సుమన్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సివిల్ ఇంజనీరింగ్, నిర్మాణభ్రష్ట విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తారీఖులలో నిర్వహించనున్న జాతీయస్థాయి సాంకేతిక సదస్సు రెండురోజులపాటు జరగనుంది. ఈ సదస్సులో క్లాష్ ఆఫ్ మైన్స్, క్రిప్టిక్ క్విస్, స్ట్రక్చరల్ కనెక్టివిటీ, క్లాష్ ఆఫ్ క్యాడ్ అంశాలపై సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుంచి 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట సుమన్ మాట్లాడుతూ సివిల్ ఇంజనీర్లు నిర్మాణాలలో అర్టిఫిషల్ ఇంటలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వినియోగం ద్వారా నిర్మాణాల నాణ్యతను ఏవిధంగా తెలుసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి, అడ్మిన్ డీన్ ఎస్.కుమారస్వామి, సివిల్ విభాగాధిపతి టి.శ్రీధర్ బాబు, సంధానకర్త చందన సుఖేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● గోతులమయంగా గ్రామాల్లోని ప్రధాన రోడ్డు

● అగచాట్లు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా ఉన్న మున్నంగి- తెనాలి రహదారి

కొల్లిపర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారటంతో ప్రయాణికులు అగచాట్లుపడుతున్నారు. రోడ్లు ఎక్కడిపడితే అక్కడ గజంలోతు గుంతలు పడటంతో ప్రయాణించాలంటేనే నరకం కనిపిస్తోందని వాహనదారులు వాపోతున్నారు. సంవత్సరాల తరబడి రోడ్లు ఇలాగే ఉన్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేక పర్యాయాలు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో దావులూరు నుంచి చక్రాయపాలెం వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు దెబ్బతిని సంవత్సరాలు కావస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. తూతూమంత్రంగా ప్యాచ్‌వర్కులు చేయడమే గాని రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్యాచ్‌వర్కులు కూడా నాణ్యతాలోపంగా ఉండటంతో రోడ్డు కొద్దికాలానికే గోతులమయంగా మారుతోంది. ఈ రోడ్డు దెబ్బతినటానికి కారణం కాంట్రాక్టర్ల లోపమే ప్రధాన కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణం నాసిరకంగా ఉండటంతో అతి తక్కువ కాలంలో దెబ్బతిందని పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా చివలూరు నుంచి మున్నంగి వెళ్లే రోడ్డు కూడా మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్డు గుంతలు, గుంతలుగా మారడంతో ప్రయాణం చేయాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్నంగి నుంచి తెనాలి వెళ్లే రోడ్డు వేసినా రోడ్డు పూర్తిగా దెబ్బతినటంతో రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం అనేక పర్యాయాలు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై రాత్రి సమయాల్లో వాహనదారులు వెళ్ళాలంటేనే భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను నూతనంగా నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న దావులూరు నుంచి చక్రాయపాలెం వెళ్లే రోడ్డు



ఖురదమయంగా మారిన చివలూరు నుంచి మున్నంగి వెళ్లే రోడ్డు



నందివెలుగు రోడ్డుపై ప్రమాద హెచ్చరికగా కర్రను నిలబెట్టి, తగిలించిన గోతం

ప్రమాదకరంగా నందివెలుగు రోడ్డు

తెనాలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగు గ్రామంలోని ప్రధాన రోడ్డు అధ్వానంగా మారి వాహనరాకపోకలు నరక ప్రాయంగా మారింది. రోడ్డుపొడవునా గుంతలు ఏర్పడటంతో వర్షం కురిసిన సమయంలో ఆ గుంతల్లో నీరు చేరి అందులో వాహనాలు చిక్కుకుని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో గ్రామస్థులు గుంతల్లో కర్రకు పట్టాను ఉంచి హెచ్చరికగా ఏర్పాటు చేశారు. అది గమనించిన వాహనదారులు అప్రమత్తతతో రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు రోడ్డు గుంతలను పూడ్చి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం : ఎంఈవో

కాకుమాను, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని మండల విద్యాశాఖాధికారి కేఏఫ్ కెన్నడీ అన్నారు. కాకుమాను ఉర్దూ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో హాజరు రిజిష్టర్, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా

షేక్ కరిముల్లా



పెదనందిపాడు, అక్టోబరు, 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా షేక్ కరిముల్లా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏ. కోటేశ్వరరావు తుళ్ళూరు సీఆర్డీఏకు బదిలీపై వెళ్ళారు. పెదనందిపాడు పంచాయతీ కార్యదర్శిగా శ్వేత, పాలపర్రు వీఆర్వోగా వీరయ్యలు తహసీల్దార్, ఎంపీడీవోల వద్ద పదవీ బాధ్యతలు స్వీకరించి విధులకు హాజరయ్యారు.

పశ్చిమడెల్టాకాల్వకు

1516 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1516 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 54,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 40 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 200 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తుళ్లూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని రాయపూడిలో ఓ రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని తుళ్లూరు పోలీసులు గురువారం రాత్రి 11 గంటల సమయంలో స్వాధీనం చేసుకున్నారు. 18 బస్తాలలో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొని శుక్రవారం మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... మృతుడు చామనఛాయ రంగు కలిగి ఉన్నాడని, వయస్సు సుమారు 30-35 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై బ్లూ రంగు టీషర్టు, బ్లూ కలర్ జీన్‌ప్యాంట్, త్రిశూలం ఆకారం గల టాటూ ఉన్నాయని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు జీఆర్‌పి ఎస్‌ఐ లక్ష్మీనారాయణరెడ్డి 83280 18787 నెంబరులో సంప్రదించాలన్నారు.

నేడు అభివృద్ధి పనులకు

శంకుస్థాపన

పెదనందిపాడు, అక్టోబరు, 18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొప్పర్రు, ఉప్పలపాడు, నాగులపాడు, పెదనందిపాడు, వరగాని, అబ్బినేనిగుంటపాలెం, గోగులమూడి గ్రామాల్లో పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా

చర్యలు తీసుకోవాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి నున్నా వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కొండేపాటు, మల్లాపాలెం గ్రామాలలో రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యవసాయక్షేత్రాలను సందర్శించిన డీఏవో రైతులకు పలు సూచనలు చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెదవడ్లపూడిలో ఘనంగా

వాల్మీకి జయంతి

మంగళగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతిని మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ శివాలయం సెంటరులోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు కఠారి అప్పారావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు వాకా మాధవరావు, నేతలు వడ్డేశ్వరం రాజారావు, యేళ్ల శివరామయ్య, అన్నే చంద్రశేఖర్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, కొడవలి ఆనంద్, యేమినేని సుధాకర్, ముతకన హరినాథ్, శివలాల్, వెంకటకృష్ణ, కఠారి సాంబయ్య, మీనగ వెంకటేశ్, మాధవరెడ్డి శ్రీన్నురాజు, గడ్డిపాటి సాంబశివరావు, సారంగపాణి, లింగినేని కృష్ణ, బొమ్మినేని రాజా, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న కిరణ్‌చంద్

గ్రామీణ రహదారులకు మహర్దశ

- ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు
- మండలానికి రూ.60 లక్షలు మంజూరు

పెదనందిపాడు, అక్టోబరు, 18(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమంతో జోడెడ్లుగా ముందుకు సాగుతుంది. దీనిలో భాగంగా గ్రామాల్లో అధ్వాన రహదారులు, డ్రెయిన్లకు మహర్దశ పట్టనుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో గడిచిన ఐదేళ్ళల్లో గ్రామాల్లో ఉపాధిహామీ నిధులు పక్కదారి పట్టించడమే కాకుండా పంచాయతీలకు నిధులు లేకుండా చేశారు. కనీసం గ్రామాల్లో రోడ్లకు, డ్రెయిన్లకు మరమ్మతులు కూడా చేపట్టిన దాఖలాలు లేకపోవడంతో మురుగు నీరు పారుదల లేక రోడ్లపైనే నిలిచి రహదారులు ఛిద్రమవడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా మారుమూల రహదారులకు సైతం మోక్షం కలుగుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి రహదారులు నిర్మాణాలు చేపట్టనుంది. మండలంలో తొలి విడతగా 8 గ్రామాలకు గాను రూ.60 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.



పెనుమూలిలో రోడ్లకు శంకుస్థాపనలో పాల్గొన్న జబీన్, కేసంనేని శ్రీఅనిత, సర్పంచ్ పద్మావతి, సురేష్ తదితరులు

దుగ్గిరాల: మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జరిగిన పల్లెపండుగలో రూ.55 లక్షలతో ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మండలంలోని మంచికలపూడి, కెఆర్ కొండూరు, పెనుమూలి గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఐదోరోజు ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో భాగంగా, కెఆర్ కొండూరులో రూ.20 లక్షలు, పెనుమూలిలో రూ.20 లక్షలతో రెండురోడ్లకు, మంచికలపూడిలో రూ.15 లక్షలతో రెండు అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిపారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్‌జబీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు మరోమారు గుర్తు చేస్తున్నా మని, త్వరలో చంద్రబాబు సూపర్ 6 పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేస్తారన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత మాట్లాడుతూ, గత ప్రభుత్వం వేలకోట్ల ప్రజా ధనాన్ని వృథా చేస్తే, కూటమి ప్రభుత్వం మండలంలో నాలుగు నెలల్లోనే, రూ.3కోట్ల 30లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు వసుపులేటి శ్రీనివాసరావు, ఎంపీ టీసీలు మరీదు రాము, షేక్ మహబూబ్ సుభాని, సర్పంచ్‌లు కొరిటాల పద్మావతి, యార్లగడ్డ చంద్రదుర్గ, ఉన్నం ఝాన్సీ, ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివా సరావు, పంచాయతీ రాజ్ ఏఈ టీ.గోవర్ధనరావు, నందిపాటి జోగారావు, కొరిటాల సురేష్, యేమినేని కోటేశ్వరరావు, అన్నాబత్తుని కల్యాణ్‌చక్రవర్తి, కేసం నేని వాసుబాబు, పోసాని వెంకటఅప్పారావు, వార్డు సభ్యులు, పలువురు కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నాగులపాడులో సీసీ రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

రైతులకు బీమా క్లెయిమ్‌లు

చెల్లించేలా చూడాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దుగ్గిరాలలో శుభం కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద ఘటనలో నష్టపోయిన రైతులకు వీలైనంత త్వరగా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి క్లెయిమ్‌లు అందించేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహాతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేతపై న్యూఇండియా ఇన్సురెన్స్ కంపెనీ, రెవెన్యూ, అగ్నిమాపక, వ్యవసాయ మార్కెటింగ్, బ్యాంకు అధికారులు, శుభం కోల్డ్ స్టోరేజీ యాజమాన్యంతో సమీక్ష నిర్వహించారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టంపై సర్వే పూర్తి చేశామని, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ తదితర శాఖలతో పాటు, కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం నుంచి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొని సోమవారం నాటికి కంపెనీ ప్రధాన కార్యాలయంకు ఫైలు పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లకు సంబంధించి అన్ని అంశాలపై తెనాలి సబ్ కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు తెలియజేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటారని చెప్పారు. సమీక్షలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, కలెక్టరేట్ 'హెచ్' సెక్షన్ పర్యవేక్షకుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.



కోల్డ్‌స్టోరేజ్ ప్రమాదం బీమా చెల్లింపులపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

హైకోర్టు రిజిస్ట్రార్ ఫిర్యాదుతో

వ్యక్తిపై కేసు నమోదు

తుళ్లూరు, అక్టోబరు 18: ఏపీ హైకోర్టు రిజస్ట్రార్ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 67 ఐటీ యాక్ట్ కింద తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం ఈ నెల 15న హైకోర్టులో కోర్టు నెంబరు 17లో గూగుల్ టీం వివర్ వీడియో లైవ్ జరుగుతుండగా బట్టలు లేకుండా మంచంపై పడుకుని ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఈ వీడియోలో జాయిన్ అయ్యాడు. కావాలని అవమానిస్తూ ప్రొసీడింగ్స్ జరగకుండా ఇబ్బంది కలిగించాడు. ఆ వ్యక్తి యూజర్ ఐడీ కిట్టు అనే పేరుతో లాగిన్ అయ్యాడని, తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశారు. ఎస్ఐ అంకమ్మ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పీసీసీ చీఫ్ షర్మిల నుంచి నియామకపత్రం అందుకున్న పూర్ణచంద్రరావు

కాంగ్రెస్ చేనేత విభాగం అధ్యక్షుడిగా

రామనాథం

మంగళగిరి సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన రామనాథం పూర్ణచంద్రరావు నియమితులయ్యారు. ఈమేరకు విజయవాడలోని ఏపీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి చేతుల మీదుగా పూర్ణచంద్రరావు శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి కాంగ్రెస్ నేతలు గుజ్జర్లపూడి జాన్‌బాబు, మంద్రు శ్రీనివాస్ కుమార్, ఏలే హేమసుందరరావు, గోలి నాగకుమార్, భీమిశెట్టి బాలతేడేరు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోండి

- నవంబరు 6 ఆఖరు తేది
- స్పెషల్ డ్రైవ్‌తో నమోదు కార్యక్రమం
- టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ చందు

తుళ్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు పక్రియ ప్రారంభమైందని, టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్, మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు నెలకుది చంద్రశేఖర్(చందు) తెలిపారు. ఆర్టీఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, నవంబరు 6తో ఈ పక్రియ ముగుస్తుందని చెప్పారు. నూతనంగా ఓటును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఫారం-18, గెజిటెడ్ అధికారి సంతకం చేసిన ఏదైనా డిగ్రీ ప్రొవిజనల్ పత్రం, పాస్ పోర్టు ఫోటో, ఆధార్ కార్డు , ఓటరు కార్డుతో ఎమ్మెల్సీ ఓటు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఆన్‌లైన్ రిజ్రేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు అప్లికేషన్లు అందజేయవచ్చని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సూచన మేరకు తాడికొండ నియోజకవర్గంలో ఆన్‌లైన్‌లో ఓటు నమోదు ప్రక్రియ టీడీపీ కూటమి నాయకులు నిర్వహిస్తున్నామని, రెండు రోజుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కృష్ణా,గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీగా టీడీపీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా పోటీ చేస్తున్నారని అన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాలను మోపొద్దు

● సీపీఎం నేతలు

● వివిధ ప్రాంతాల్లో నిరసనలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారాలను మోపటం సరైది కాదని, ఆ ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే విరమించకోవాలని సీపీఎం నేతలు డిమాండ్‌చేశారు. ఈమేరకు శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి ఘాట్ రోడ్డులోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం నేత జేవీ రాఘవులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రూ.వేల కోట్ల విద్యుత్ భారాలను వినియోగదారులపై మోపిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వమూ అదేబాటలో నడుస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పీ.బాలకృష్ణ, ఎస్ఎస్ చెంగయ్య, కమలాకర్, వీసం జవహర్‌లాల్, బాలాజీ, శివభావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చినకాకానిలో. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చినకాకాని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాచేశారు. సీపీఎం జిల్లా నేత ఈమని అప్పారావు పాల్గొన్నారు.

పెదనందిపాడులో.. విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక గ్రామసచివాలయం-2 ఎదుట సీపీఎం నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నాగులపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయకులు కొత్త వెంకటశివ, ముద్దన వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో.. ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట భారం వేయడం తగదని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాలలోని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు తహసీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మన్నవ నాగమల్లేశ్వరరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, మన్నవ నరసింహారావు, భీమవరపు అమ్మిరెడ్డి, రాజేష్, ఎస్ఎస్. రత్నం తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి.. ప్రజలపై ట్రూ అప్ విద్యుత్ చార్జీల పేరిట భారాలు మోపే ప్రయత్నాలు విరమించుకోవాలని సీపీఎం సీనియర్ నేత జొన్నా శివశంకర్ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం రూరల్ కమిటీ నేతలు ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, విజయరాజు, బొప్పన గోపాలరావు, కంచర్ల జేమ్స్ సుబ్బారావు, ప్రభాకర్, నాయక్ పాల్గొన్నారు.



మంగళగిరిలో విద్యుత్ ఉపకేంద్రం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

మేడికొండూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఇంధన చార్జీల భారం ప్రజలపై వేసేందుకు సిద్ధం అవుతుందని, ఆ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం డోకిపర్రు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మేడికొండూరు శాఖ కార్యదర్శి ఎస్ఎం బాషా, జిల్లా కమిటీ సభ్యులు భైరగాని శ్రీనివాసరావు తదితరులు తెలిపారు.

ఫిరంగిపురం : విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న రూ.20 వేల కోట్ల భారాలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లాకమిటీ సభ్యులు భైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఫిరంగిపురం మండల సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ స్టేషన్ అధికారు లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్ఎం వలి, మండల కమిటీ సభ్యులు జీవీ రావు, అంకమరావు, బాలశౌరి, సాంబశివరావు, శ్రీనివాసరావు, ఏసుబాబు, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ : స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, రైతు సంఘం నాయకులు ఇమ్మడి రామారావు, బాణావత్ భద్రయ్య, జోషి, షేక్ సుభాని, కోటిరెడ్డి పాల్గొన్నారు.

తుళ్లూరు : కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై వేయబోతున్న 8,114 కోట్ల విత్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. తుళ్లూరు లైబ్రరి సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాయపూడిలోని విద్యుత్ కార్యాలయంలో సీఆర్డీఏ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈకి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు, వల్లభపురం వెంకటేశ్వరావు రాజధాని డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

20న కుంచనపల్లిలో

ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని రామస్నేహ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ డీమార్ట్ పక్కన కుంచనపల్లి బైపాస్ వద్ద మానవసేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ఉదయం 8 నుండి 1 గంట వరకు ఈ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇక నుండి ప్రతి నెల రెండో ఆదివారం రామ్‌స్నేహ ఎవెన్యూ అపార్టుమెంట్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్థానికులు కుంచనపల్లి పరిసర ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 20న జరిగే ఉచిత వైద్య శిబిరంలో జనరల్ వైద్యులు, డయాబెటిక్, దంత, కంటి వైద్యులు పాల్గొంటారన్నారు. షుగరు, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

మంగళగిరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలోని సత్రాల రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు కోరారు. సీపీఎం నేతల బృందం శుక్రవారం రోడ్డును పరిశీలించింది. గతంలో వర్షపు నీరు పారేందుకు రోడ్డును తవ్వారని, నేటికీ పూడ్చకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. స్థానిక అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ప్రజల ఇబ్బందులను గుర్తించి ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు బి.కోటేశ్వరీ, టీ.ప్రసాదరెడ్డి, ఆళ్ల సాంబిరెడ్డి, ఎస్.సుమ, ఎస్.నిర్మల, బాబూవరప్రసాద్, ఉద్దంటి దుర్గారావు, కుమారస్వామి, గాదె మాధవరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నేత శివశంకరరావు



యామర్రు ఎస్సీ కాలనీ వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బూర్ల

పార్టీ కోసం నిబద్ధతతో పని చేయాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యామర్రు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన పది కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరేందుకు రాగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షులు మన్నవ పూర్ణచంద్రరావు, యామర్రు గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాంబశివరావు, నాయకులు మర్రి సాంబశివరావు, గడ్డిపాటి సుధాకరరావు, గారపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్న సుబ్బారావు, గారపాడు మాజీ ఎంపీటీసీ తాటి వీరయ్య, కే మధుసూదనరావుల ఆధ్వర్యంలో చేరారు. ఎస్సీ కాలనీకి చెందిన వేజెండ్ల భైరాగి, బలరాజు, మరియదాసు, జక్కయ్య, సీలామాన్, ప్రతాప్, నాగేశ్వరరావు, చింతయ్య, శాంతి రాజు, ఆళ్ళ రాజులు కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరినట్టు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు కేంద్రం ప్రారంభం

మంగళగిరి సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టిప్పర్ల బజారులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటు నమోదు కార్యాలయాన్ని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, సీఐటీయూ నేతలు జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, ఎ.శ్రీనివాసరావు, యూ.రాజశేఖర్, జీ.అచ్యుత రావు, టీ.ఆంజనేయులు, ఎం.కోటిరెడ్డి, యూ.ఏడుకొండలు, సీహెచ్ ఆనంద్‌కుమార్, సుబ్బారావు, పీ.అరుణ్, కే.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'జనవాణి'లో అర్జీల స్వీకరణ

మంగళగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలు తెలియజేస్తున్నారు. జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ శుక్రవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అత్యవసర సమస్యలను అప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి.మహేందర్‌రెడ్డి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్, చేనేత వికాస విభాగం చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోపూరికి జాతీయ ప్రతిభా పురస్కారం

పెదనందిపాడు,అక్టోబరు,18 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడుకు చెందిన రోటరీ జిల్లా మీడియా కోఆర్డినేటర్, అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ చేస్తున్న సేవలను గుర్తించి ఎస్‌పీఎల్డీవో సంస్థ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారానికి ఎంపిక చేసి, నియామక పత్రాన్ని అందజేసినట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఏసీ కళాశాలలో ఆదివారం అబ్దుల్‌కలాం జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ పురస్కారాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేల చేతులమీదుగా పురస్కారాన్ని అందుకోనున్నట్లు తెలిపారు.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై కౌన్సెలింగ్



సుమ అట్లూరిని సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ కెఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ సోని

తాడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ప్రత్యేకంగా మానసిక, పర్సనాలిటి డెవలప్‌మెంట్, కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని బాలికలకు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేఫ్ ఉపాధ్యక్షురాలు సుమ అట్లూరి ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు అవగాహన కల్పించారు. సుమ అట్లూరి ఏపీలోని తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్‌లో కోర్ లీడర్‌షిప్ సభ్యురాలు, రీసోర్స్ పర్సన్‌గా పని చేశారు. ఆమె మాట్లాడుతూ జీవిత నైపుణ్యాలు భావోద్వేగ మద్దతు మానసిక ఆరోగ్య విద్య, స్వీయ అవగాహన, ఒత్తిడిని అధిగమించడం వంటి అంశాలు బాలికల విషయంలో ముఖ్యమైనవన్నారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.సారధివర్మ ప్రోవీసీలు ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి విభాగ సంక్షేమ డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్, ఉమన్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ రూత్ రమ్య, కోకన్వీనర్ డాక్టర్ కె సోని, ఫెడ్ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, హెచ్‌వోడీ బిఇఎస్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుమ అట్లూరిని ఘనంగా సత్కరించారు.

ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లు చోరీ

తాడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో విద్యార్థులు ఉంటున్న ఓ రూములో మూడు ల్యాప్‌టాప్‌లు, రెండు సెల్ ఫోన్లు, ఏటీఎం కార్డు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు విద్యార్థులు తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు హర్షవర్ధన్, కోటిరెడ్డి, సుమంత్ ఒక రూములో ఉంటున్నారు. బుధవారం రాత్రి చదువుకున్న అనంతరం తమ రూము తలుపు వేయకుండా మర్చిపోయి నిద్రించారు. గురువారం తెల్లవారుజాము సమయంలో మెళకువ వచ్చి లేచి చూసేసరికి సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఏటీఎం కార్డు ఉన్న పర్స్ మాయమైనట్టు గుర్తించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో వెతికి గురువారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు విద్యార్థులు తెలిపారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మేడికొండూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఖాతాదారుడు వంచనకు, మోసానికి గురికాకుండా అవగాహనతో బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిరిపురం బ్రాంచ్ మేనేజర్ అఖిల చెప్పారు. మేడికొండూరు మండలం మందపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్‌పై ఒకరోజు వర్క్ షాప్ శుక్రవారం నిర్వహించారు. వర్క్‌షాప్‌కి అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రసారమాధ్యమాలలో విస్తృతంగా వచ్చే మోసపూరిత ప్రకటనలను చూసి మోసపోకుండా ప్రతి ఒక్కరూ బ్యాంకు నిబంధనలకు లోబడి ఉండాలని అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా వీవో లాలునాయక్ మాట్లాడుతూ బ్యాంకులద్వారా పొందే వివిధ సబ్సిడీ లోన్లు ఉపయోగించుకొని అందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ కె. వేంకటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ షేక్ బాజీ, మందపాడు డ్వాక్రా సీసీ మేరీ, యానిమేటర్లు అశ్విని, వెలంగిణి, వివిధ బ్యాంకుల ఖాతాదారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భారతీయ రిజర్వు బ్యాంకు ఖాతాదారుల శిక్షణా కర పత్రాలను ఆవిష్కరించారు.

వ్యవసాయ రంగ సమస్యలపై 22న సదస్సు

మంగళగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగ సమస్యలపై ఈ నెల 22వ తేదీన విజయవాడలోని ఎంబీవీకే భవనంలో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు తెలిపారు. మంగళగిరి రైతు సంఘం కార్యాలయంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం ఎ.సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగింది. శివశంకరరావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణ విమోచన చట్టం అమలు, అక్కడి రైతు అనుకూల విధానాలను వివరించారు. ఈ నెల 22న జరగనున్న సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, సహాయ కార్యదర్శి టీ.సాగర్, కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల కార్యదర్శి టీ.ప్రసాద్‌రెడ్డి, నేతలు గైరుబోయిన నాగేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న వ్యవసాయ రంగ సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు విజయవాడలోని ఎంబీ విజ్ఞానకేంద్రంలో జరుగుతుందని ఈసదస్సును జయప్రదం చేయాలని శుక్రవారం తాడేపల్లిలో జరిగిన మండల రైతు కమిటి సమావేశంలో నేతలు తీర్మానించారు. ఈ సమావేశానికి మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాజ వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి కోటిరెడ్డి, బుల్లికోటిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీరామ్ డి భాస్కరరెడ్డి, బి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.